ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3
తమిళనాడు
TAMILNADU
బుధవారం 3 డిసెంబరు 2025

ముంచెత్తిన వాన...
మునిగిన రహదారులు

● చెన్నైలో 15సెం.మీ.
ఎన్నూరులో 26 సెం.మీ వర్షపాతం

● నేడూ చెన్నై సహా ఐదు జిల్లాల్లో భారీవర్షం ● వర్షాలకు నలుగురి దుర్మరణం


వ్యాసర్పాడి సబ్‌వేలో చేరిన నీటిలో చిన్నారుల సందడి

చెన్నై, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాన్ కారణంగా గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షం.. మంగళవారం కూడా కొనసాగింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు కురిసిన వర్షానికి నగరంలోని లోతట్టు ప్రాంతాలతో పాటు ప్రధాన రోడ్లు కూడా జలమయమయ్యాయి. అన్నాసాలై, మెరీనా, శాంతోమ్, మైలాపూర్, ఎమ్మార్సీ నగర్, వేళచ్చేరి, పట్టాలం తదితర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. వేళచ్చేరి, పట్టాలం ప్రాంతాల్లో రోడ్లపై వర్షపు నీరు ప్రవహించడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. కోడంబాక్కం, టినగర్‌లోని పలు ప్రాంతాల్లో వర్షపు నీరు రోడ్లపై రెండడుగుల మేర ప్రవహించింది. నుంగంబాక్కం కామరాజపురం ప్రాంతంలోని ఇళ్లలో వర్షపు నీరు ప్రవేశించింది. తిరువొత్తియూర్ పరిసర ప్రాంతాల్లో సోమవారం రాత్రి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగడంతో ప్రజలు మరింత ఇబ్బందులు పడ్డారు.

నేడు ఐదు జిల్లాలకు వర్ష సూచన...

తిరువళ్లూర్, చెన్నై, చెంగల్పట్టు, కాంచీపురం, రాణిపేట జిల్లాల్లోని కొన్నిప్రాంతాల్లో బుధవారం భారీ వర్షం కురిసే అవకాశముందని వాతావరణశాఖ అంచనా వేసింది. అలాగే, నీలగిరి, ఈరోడ్, కోవై జిల్లాల్లో భారీ నుంచి అతి భారీవర్షాలు, తిరుప్పూర్, తేని, దిండుగల్ తదితర జిల్లాల్లో భారీవర్షం కురిసే అవకాశముందని ప్రాంతీయ వాతావరణ కేంద్రం తెలిపింది. నైరుతి బంగాళాఖాతం, దానిని అనుకుని ఉన్న పశ్చిమ-మధ్య బంగాళాఖాతం, ఉత్తర తమిళనాడు, పుదుచ్చేరి, దక్షిణ ఆంధ్రప్రదేశ్ తీరాల్లో సోమవారం ఏర్పడిన తీవ్ర అల్పపీడనం ఉత్తర వైపు కదలి మంగళవారం ఉదయం బలహీనపడి అల్పపీడనంగా మారింది. ఉదయం 8.30 గంటలకు అదే ప్రాంతంలో, చెన్నైకి తూర్పుఆగ్నేయంగా 40 కి.మీ, పుదుచ్చేరికి ఈశాన్యంగా 120 కి.మీ, కడలూరు, నెల్లూరులకు దక్షిణ ఆగ్నేయంగా 190 కి.మీ దూరంలో కేంద్రీకృతమై ఉంది. దీని ప్రభావంతో తిరువళ్లూర్, చెన్నై, చెంగల్పట్టు, కాంచీపురం, రాణిపేట జిల్లాల్లో ఒకటి, రెండు ప్రాంతాల్లో అతి భారీ వర్షం, వేలూరు, తిరువణ్ణామలై, కళ్లకుర్చి, విల్లుపురం, కడలూరు జిల్లాలు, పుదుచ్చేరిలో భారీవర్షం కురిసింది. అల్పపీడనం బుధవారం వేకువజామున, ఉదయం తీరం దాటే అవకాశముంది. దీని ప్రభావంతో, బుధవారం చెన్నై, చెంగల్పట్టు, తిరువళ్లూర్, కాంచీపురం, రాణిపేట జిల్లాల్లో భారీవర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం తెలిపింది.

ఎన్నూరులో రికార్డు స్థాయిలో వర్షపాతం

నగరంలో గడిచిన 24 గంటల్లో ప్యారీస్‌లో అత్యధికంగా 26.5 సెం.మీ వర్షపాతం నమోదైంది. సాధారణ వర్షపాతం 13 సెం.మీ. కాగా ఎన్నూర్‌లో 26.5 సెం.మీ, ఐస్‌హౌస్ ప్రాంతంలో 23 సెం.మీ, బేసిన్ బ్రిడ్జి, మనలి పుదూర్ ప్రాంతాల్లో తలా 20 సెం.మీ, నుంగంబాక్కంలో 17 సెం.మీ వర్షపాతం నమోదైంది.


ఎటు చూసినా రోడ్లపై వరద నీరే



వర్షపు నీటిని మోటర్లతో తొలగించడాన్ని పరిశీలిస్తున్న ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, మంత్రులు కేఎన్ నెహ్రూ, పీకే శేఖర్‌బాబు, చెన్నై మేయర్ ప్రియ, ఎమ్మెల్యే కరుణానిధి, ఉన్నతాధికారులు

'దిత్వా' కారణంగా నలుగురి మృతి: మంత్రి రామచంద్రన్

రాష్ట్రంలో 'దిత్వా' తుఫాను కారణంగా కురిసిన భారీవర్షాలకు ఇప్పటివరకు నలుగురు మృతిచెందినట్లు రాష్ట్ర రెవెన్యూ, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి కేకేఎస్ఎస్ఆర్ రామచంద్రన్ తెలిపారు. అలాగే, నీటమునిగి దెబ్బతిన్న పంటలకు హెక్టారుకు రూ.20వేల చొప్పున పరిహారం అందించనున్నట్లు మంత్రి తెలిపారు. ఈ మేరకు నగరంలో మంగళవారం మంత్రి మీడియాతో మాట్లాడుతూ... భారీవర్షాల కారణంగా రాష్ట్రవ్యాప్తంగా 85,521.76 హెక్టార్లలో పంట నష్టం వాటిల్లిందన్నారు. ప్రస్తుతం దెబ్బతిన్న పంట వివరాలను అధికారులు సేకరిస్తున్నారని తెలిపారు. భారీవర్షాల కారణంగా నలుగురు మృతిచెందగా, 582 పశువులు చనిపోయాయయని, 1,601 గృహాలు దెబ్బతిన్నాయన్నారు. మైలాడుదురై, విల్లుపురం జిల్లాల్లో తలా ఒకరు విద్యుదాఘాతంతోను, తూత్తుకుడి, తంజావూరులో గోడలు కూలి ఇద్దరు మృతిచెందారని తెలిపారు. నగరంలో సరాసరిన 15 సెం.మీ వర్షం కురిసిందని, బలమైన గాలుల కారణంగా 27 చెట్లు విరిగ్గాయని తెలిపారు.

నేడు రెండు జిల్లాల్లో విద్యాలయాలకు సెలవు

భారీవర్షాలు కురిసే అవకాశముందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో చెన్నై, తిరువళ్లూరు జిల్లాల్లోని విద్యాలయాలకు బుధవారం సెలవు ప్రకటించారు. ఈ మేరకు ఆయా జిల్లాల కలెక్టర్లు ప్రకటన విడుదల చేశారు.

రిజిస్ట్రేషన్‌శాఖకు ఒకే రోజు
రూ.302 కోట్ల ఆదాయం



మైలాపూర్ శాంథోమ్‌లో ఉన్న రిజిస్ట్రేషన్ కార్యాలయం

ప్యారీస్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రిజిస్ట్రేషన్ శాఖ చరిత్రలో ఇప్పటివరకు లేని విధంగా ఒకేరోజు రూ.302కోట్ల ఆదాయం సాధించి సరికొత్త రికార్డు నమోదైంది. రాష్ట్ర ప్రభుత్వానికి అధిక ఆదాయం కల్పించడంలో రిజిస్ట్రేషన్ శాఖ ప్రధాన పాత్రవహిస్తోంది. ఆస్తుల కొనుగోళ్లు, విక్రయాలు, సెటిల్మెంట్లకు సం బంధించిన రిజిస్ట్రేషన్ల కోసం ప్రజలు ఆయా ప్రాంతాల్లో ఉన్న సబ్ రిజిస్టర్ కార్యాలయాలను ఆశ్రయిస్తుంటారు. ముఖ్యంగా శుభముహూర్తాల రోజుల్లో అధికస్థాయిలో రిజిస్ట్రేషన్లున్నందున ముందురోజే టోకన్లు ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో, సోమవారం శుభముహూర్తం కావడంతో రిజిస్ట్రేషన్ శాఖ చరిత్రలోనే ఇప్పటివరకు లేనివిధంగా ఒకే రోజు రిజిస్ట్రేషన్ల రూపం రూ.302 కోట్ల ఆదాయంతో రికార్డు నెలకొల్పడం గమనార్హం.

విరుదాచలంలో రూ.2.23లక్షల స్వాధీనం...

కడలూరు జిల్లా విరుదాచలం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు సోమవారం రాత్రి 8 నుండి మంగళవారం ఉదయం 5 గంటల వరకు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి లెక్కలో చూపని రూ.2.23లక్షలు స్వాధీనం చేసుకున్నారు. కడలూరు జిల్లా ఏసీబీ డీఎస్పీ అళగేశన్ నేతృత్వంలో పది మందికి పైగా అధికారులు తనిఖీలు నిర్వహించారు. బయటి వ్యక్తులను అనుమతించకుండా పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. డాక్యుమెంట్ రైటర్లు, మధ్యవర్తుల వాహనాలను కూడా తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో లెక్కల్లో చూపించని రూ.2.23లక్షల నగదును గుర్తించి స్వాధీనం చేసుకున్న అధికారులు దీనిపై దర్యాప్తు చేపట్టారు.

పురుషముని వాహనంపై అరుణాచలేశ్వరుడు

వేలూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): అరుణాచలేశ్వరాలయంలో జరుగుతున్న కార్తిక దీపోత్సవాల్లో మంగళవారం ఉన్నాములై సమేత అన్నామలైయార్ పురుషముని వాహనంలో ఊరేగారు.. అదే విధంగా ప్రత్యేక అలంకారంలో వల్లి,దేవసేన సమేత సుబ్రమణ్యస్వామివార్ల ఉత్సవమూర్తులను అలంకరించి పల్లకీలో ఊరేగించగా, భక్తులు హారతులు పపట్టారు.


పురుషముని వాహనంపై విహరిస్తున్న స్వామివారు

విజయ్ రోడ్‌షోకు
అనుమతి నిరాకరణ

● పుదుచ్చేరి స్పీకర్ సెల్వం

పుదుచ్చేరి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే) అధ్యక్షుడు విజయ్ ఈ నెల 5వ తేదీ పుదుచ్చేరిలో చేపట్టదలచిన రోడ్‌షోకు పోలీసులు అనుమతి నిరాకరించారు. టీవీకే వినతిపత్రాన్ని పరిశీలించిన ఐజీ అజిత్‌కు మార్‌సింగ్ అనుమతి నిరాకరిస్తున్నట్లు ప్రకటించారు. దీనిపట్ల టీవీకే శ్రేణులు, విజయ్ అభిమానులు తీవ్ర నిరాశతో వున్నారు. ఈ నేపథ్యంలో పుదుచ్చేరి అసెంబ్లీ స్పీకర్ సెల్వం పోలీసుల వైఖరిని సమర్థించారు. విజయ్‌కు అనుమతివ్వకపోవడం మంచిదేనని వ్యాఖ్యానించారు. మంగళవారం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ.. చిన్ననగరమైన పుదుచ్చేరిలో రోడ్‌షో నిర్వహిస్తే ఇబ్బందులు ఎదురవుతాయని, తమిళనాడులో లాగా ఇక్కడ పెద్దరోడ్లు లేవన్నారు. అవసరమైతే విజయ్ ప్రైవేటుగా ఓ మైదానాన్ని ఎంపిక చేసి అందులో సభ జరుపుకోవడం తమకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు.

కుటుంబంలో విషాదం..
విద్యుదాఘాతంతో తండ్రీకొడుకుల దుర్మరణం


మృతులు లోకేష్, వికాస్, జానకిరామన్ (ఫైల్‌ఫొటోలు)

వేలూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): తెగిన విద్యుత్ వైర్లు తగడంతో ముగ్గురు వ్యక్తులు మృతిచెందిన సంఘటన వేలూరు జిల్లా బడుగత్తూరు సమీపంలోని రామనాయనికుప్పంలో చోటుచేసుకుంది. ఆ గ్రామంలో పొలం పనిచేస్తూ కుటుంబంతో నివసిస్తున్న జానకిరామన్ (55)కు వికాస్ (25), లోకేష్ (23), జీవా (22)అనే ముగ్గురు కుమారులున్నారు. ఈ క్రమంలో సోమవారం ఉదయం పొలంతో మందు చల్లేందుకు జానికిరామన్ వెళ్లాడు. ఇటీవల కురిసిన భారీవర్షానికి దగ్గరలోని విద్యుత్ వైర్ తెగి పొలానికి వేసిన కంచెకు తగలడంతో పొలం నుంచి వస్తున్న జానకిరామన్ కంచెను దాటుతుండగా, విద్యుదాఘాతానికి గురయ్యాడు. ఇది గమనించిన అతడి కుమారులు రక్షించేందుకు ప్రయత్నించగా, వారు కూడా ఘటనా స్థలంలోనే మృతిచెందారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

దివ్యాంగులు
గౌరవంగా జీవించేలా చర్యలు

● 'అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం' సందర్భంగా సీఎం శుభాకాంక్షలు
● ప్రభుత్వ ప్రెస్ ఉద్యోగుల గృహ సముదాయాల ప్రారంభం




గృహ సముదాయాన్ని ప్రారంభిస్తున్న సీఎం స్టాలిన్

చెన్నై, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు సమాన హక్కులు, అవకాశాలు కల్పించడంతో పాటు సమాజంలో వారు గౌరవంగా జీవించేలా అన్ని చర్యలు చేపట్టినట్లు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రకటించారు. బుధవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం జరుపుకోనున్న సందర్భంగా ముఖ్యమంత్రి మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. దివ్యాంగుల సంక్షేమానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం.. ప్రతి ఏడాది డిసెంబరు 3న అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం నిర్వహిస్తోందని తెలిపారు. ప్రపంచ బ్యాంకు రుణ సాయంతో అమలుచేస్తున్న 'తమిళనాడు హక్కుల పథకం'లో దివ్యాంగులకు ప్రయోజనం చేకూర్చేలా పలు పథకాలు, సేవలు అందిస్తున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా స్థానిక సంస్థల్లో దివ్యాంగుల ప్రతినిధులు ఉండేలా సవరణలు చేసి, ప్రజల సంక్షేమం కోసం నిర్ణయాలు తీసుకునే అధికారం దివ్యాంగులకు కూడా కల్పించామన్నారు. విద్య, వైద్యం, ఆర్థికంగా వారిని అభివృద్ధి చేయడం తదితరాలను ద్రావిడ మోడల్ ప్రభుత్వం చేపట్టిందని సీఎం తెలిపారు.

ప్రభుత్వ ప్రెస్ ఉద్యోగుల కోసం.. గృహ సముదాయం

ప్రభుత్వ ప్రెస్ ఉద్యోగుల కోసం నిర్మించిన నూతన గృహాలను ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రారంభించారు. శాసనసభలో ప్రకటించిన విధంగా తండయార్‌పేట కామరాజ్ నగర్‌లో రూ.39.39 కోట్లతో ఆరు అంతస్తులతో 96 గృహాలతో కూడిన సముదాయం నిర్మించారు. వాటిని ప్రభుత్వ ప్రెస్ ఉద్యోగులకు కేటాయించారు. స్థానిక సచివాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి స్టాలిన్, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ గృహ సముదాయాన్ని ప్రారంభించి, ఉద్యోగులకు ఇళ్ల కేటాయింపు ఉత్తర్వులు అందజేశారు. కార్యక్రమంలో తమిళ అభివృద్ధి, సమాచార శాఖ మంత్రి స్వామినాథన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మురుగానందం, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

పళనిలో దీపోత్సవానికి విస్తృత ఏర్పాట్లు



ప్యారీస్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సుబ్రమణ్యస్వామి కొలువైన ఆరు ప్రధాన క్షేత్రాల్లో మూడవదైన దిండుగల్ జిల్లా పళని దండాయుధపాణి స్వామివారి ఆలయంలో బుధవారం కార్తిక మహాదీపోత్సవం వైభవంగా నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాలు గత నెల 24వ తేదీన కంకణధారణతో ప్రారంభంకాగా, ప్రతిరోజూ సాయంత్రం షణ్ముఖార్చన, షణ్ముఖ దీపారాధన, యాగశాల పూజలు, స్వర్ణరథం ఊరేగింపు నిర్వహించారు. ఆరో రోజైన గురువారం సాయంత్రం భరణిదీపం వెలిగించారు. ఇక బుధవారం కార్తికమహా దీపోత్సవం సందర్భంగా చొక్కపానై (తాటాకులను కుండ రూపంలో కట్టి) దహన కార్యక్రమం నిర్వహించనున్నారు. చొక్కపానై దహనం కారణంగా బుధవారం ఆలయంలో స్వామివారి స్వర్ణ రథం ఊరేగింపు రద్దు చేస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. కార్తీక మహాదీపోత్సవాన్ని పురస్కరించుకుని ఇప్పటికే పళనిలో భక్తుల రద్దీ పెరిగింది. మధ్యాహ్నం 2 నుండి సాయంత్రం 6 గంటల వరకు పళనిపర్వతాలయంపైకి భక్తులను అనుమతించబోమని అధికారులు వెల్లడించారు. ఆరు గంటల తర్వాతే కొండమీది ఆలయంలో భక్తులను దర్శనానికి అనుమతిస్తామన్నారు.

నేడు తిరువణ్ణామలైలో కార్తిక 'మహా దీపోత్సవం'

ప్యారీస్/వేలూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సుప్రసిద్ధ శైవ క్షేత్రమైన తిరువణ్ణామలై మహా దీపోత్సవానికి ప్రత్యేక అంశాలతో ముస్తాబైంది. అగ్నిక్షేత్రమైన అరుణాచలేశ్వరాలయ ప్రాంగణాన్ని విద్యుద్దీపాలతో, మామిడి, అరటి తోరణాలు, పూలతో అలంకరించారు. ఈ ఆలయంలో గత నెల 24న ధ్వజారోహణంతో ప్రారంభమైన కార్తిక దీపోత్సవాల్లో ప్రధానమైన కార్యక్రమంగా బుధవారం సాయంత్రం 2,668 అడుగుల ఎత్తు కొండ శిఖరంపై మహాదీపం వెలిగించనున్నారు. మహాదీపం కోసం ప్రత్యేకంగా తయారుచేసిన పాత్రకు పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ సిబ్బంది కొండపైకి తీసుకువెళ్లారు. ఈ మహాదీపం 11 రోజుల పాటు దేదీప్యమానంగా వెలిగేలా ప్రత్యేకంగా తయారుచేసిన పాత్రలో 4,500 కిలోల నెయ్యి వినియోగిస్తారు. ఉన్నాములై సమేత అన్నామలైయార్ ఆలయంలో శివాచార్యులు బుధవారం తెల్లవారు జామున 4 గంటలకు ప్రత్యేక పూజలు నిర్వహించి 'భరణి దీపం' వెలిగిస్తారు.

● కొండ శిఖరంపైకి తరలిన దీప పాత్ర


కొండపైకి మహాదీప పాత్రను తరలిస్తున్న సిబ్బంది

40లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం..

ఈ మహాదీపాన్ని దర్శించుకునేందుకు రాష్ట్రంల నుంచే కాకుండా ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ, కేరళ తదితర రాష్ట్రాల నుండి సుమారు 40 లక్షల మందికి పైగా భక్తులు వచ్చే అవకాశ ఉండటంతో జిల్లా యంత్రాంగం రద్దీలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రత కట్టుదిట్టం చేసింది. అలాగే భక్తులకు తాగునీరు, మరుగుదొడ్లు తదితర కనీస వసతులు కూడా సమకూర్చింది. కాగా, భక్తుల సౌకర్యార్థం రాష్ట్ర ప్రభుత్వ రవాణా సంస్థలు ప్రత్యేక బస్సులు, దక్షిణ రైల్వే ప్రత్యేక రైళ్లను తిరువణ్ణామలైకు నడుపుతున్నాయి. దాదాపు 15వేల మంది పోలీసులు తిరువణ్ణామలై క్షేత్రంలో మోహరించారు. గిరిప్రదక్షిణ మార్గంలో ఏర్పాటు చేసిన వాచ్‌టవర్ల నుండి భద్రతా ఏర్పాటు పర్యవేక్షిస్తున్నారు. తిరువణ్ణామలై ప్రాంతంలో రాష్ట్ర ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటయ్యాయి. అత్యవసర సేవల కోసం 108 అంబులెన్స్ వాహనాలు, ఫైర్ ఇంజన్లను సిద్ధం చేశారు. తిరువణ్ణామలై మున్సిపాలిటీకి చెందిన 1,200 మంది పారిశుధ్య కార్మికులు విధుల్లో పాల్గొంటారు. కార్తిక దీపోత్సవం సందర్భంగా గిరిప్రదక్షిణ మార్గంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సంతలో పశువులు, గుర్రాలను విక్రయించనున్నారు.


కొప్పెరకు పూజలు నిర్వహిస్తున్న భక్తులు

సమాచార దృష్టి

8 నుంచి గ్రూప్-4 సర్టిఫికెట్ల పరిశీలన

పెరంబూర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 8వ తేది గ్రూప్-4 పోస్టుల భర్తీకి సంబంధించిన సర్టిఫికెట్ల పరిశీలన ప్రారంభం కానుంది. ఈ మేరకు తమిళనాడు ప్రభుత్వ ఉద్యోగుల ఎంపిక కమిషన్ (టీఎన్‌పీఎస్సీ) విడుదల చేసిన ప్రకటనలో వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న గ్రూప్-4 పోస్టుల భర్తీకి నిర్వహించిన రాతపరీక్షల్లో అభ్యర్థులు పొందిన మార్కులు, ర్యాంకుల జాబితాను గత నెల 22న తమ వెబ్‌సైట్‌లో విడుదల చేశామన్నారు. ఈ పోస్టుల భర్తీకి సంబంధించి ఒరిజినల్ సర్టిఫికెట్ల పరిశీలన ఈ నెల 8 నుంచి 18వ తేది వరకు (శని, ఆదివారాలు మినహా) బ్రాడ్ వే సమయం లోని టీఎన్‌పీఎస్సీ కార్యాలయంలో జరుగుతుందని తెలిపింది. ఒరిజినల్ సర్టిఫికెట్ల పరిశీలన, ఇంటర్వ్యూకు ఎంపిక అభ్యర్థుల వివరాలు www.tnpsc.gov.in అనే వెబ్‌సైట్‌లో విడుదల చేశామని తెలిపింది. అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్ల పరిశీలన, ఇంటర్వ్యూ తేదీ, సమయం, ఇతర వివరాలకు అదే వెబ్‌సైట్ సంప్రదించవచ్చని టీఎన్‌పీఎస్సీ తెలిపింది.

నైపుణ్యాభివృద్ధి పరీక్షలో ఎంపికైన విద్యార్థులు

పెరంబూర్, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): తమిళ భాష నైపుణ్యాభివృద్ధి పరీక్షఅక్టోబరు 11వ తేది నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా జరిగిన ఈ పరీక్షకు 2,70,508 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇందులో 1,500 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. వారిలో 750 ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులున్నారు. ఎంపికైన విద్యార్థులకు పాఠశాల విద్యాశాఖ డైరెక్టరేట్ తరఫున నెలకు 1,000 చొప్పున రెండేళ్లు అందించనున్నారు. ఈ ప్రోత్సాహక నిధి ఎంపికైన విద్యార్థుల వివరాలను www.dge.tn.gov.in అనే వెబ్‌సైట్‌లో విడుదల చేసినట్టు అధికారులు తెలిపారు.

ఆస్తి పత్రాల నమోదుకు మొబైల్ నెంబరు తప్పనిసరి

పెరంబూర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆస్తి పత్రాలు నమోదుచేసే సమయంలో మొబైల్ ఫోన్ నెంబరు తప్పనిసరిగా తెలియజేయాలని రిజిస్ట్రేషన్ శాఖ ప్రకటించింది. పత్రాలు నమోదుకు, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వెబ్‌సైట్‌లో ఆస్తి విక్రేత, కొనుగోలుదారు తదితరుల వివరాలు నమోదుచేయాల్సి ఉంటుంది. ప్రాథమిక పరిశీలన అనంతరం పత్రాల రిజిస్ట్రేషన్‌కు సమయం కేటాయించి, టోకెన్ ఇస్తుంటారు. చాలా మంది డాక్యుమెంటు క్లర్కుల ద్వారా సమాచారం నమోదుచేసుకుంటున్నారు. నమోదు సమయం సంబంధిత డాక్యుమెంట్ క్లర్కులు, వారి న్యాయవాదుల మొబైల్ నెంబర్లకు ఎస్‌ఎంఎస్ వెళుతోంది. ఈ కారణంగా, నిర్దిష్ట దస్తావేజుల సమాచారాన్ని సంబంధిత వ్యక్తికి అందించలేకపోతున్నారు. దీనిపై దృష్టిసారించిన రిజిస్ట్రేషన్‌శాఖ, పత్రాల నమోదు సమయంలో విక్రేత, కొనుగోలుదారులు సరైన మొబైల్ నెంబరు అందించాలని ఉత్తర్వులుజారీచేసింది.

5 వరకు బంగారు కవచంలో వీరరాఘవ పెరుమాళ్

పెరంబూర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూర్ వీరరాఘవ పెరుమాళ్ ఈ నెల 5వ తేది బంగారు కవచం ధరించి భక్తులకు దర్శనమిస్తున్నారు. ఈ ఆలయంలో ప్రతి ఉడాది కార్తీక మాసంలో ఉత్సవమూర్తికి బంగారు కవచం, తైల తాపడం చేస్తుంటారు. ఆ ప్రకారం, మంగళవారం ప్రత్యేక పూజల అనంతరం స్వామి వారిని బంగారు కవచంతో అలంకరించారు. ఈ నెల 5వ తేది వరకు బంగారు కవచ ధారణలో ఉన్న స్వామివారిని భక్తులు వీక్షించవచ్చు. అనంతరం 6 నుంచి 29వ తేది వరకు తైల తాపడం జరుగుతుంది. తైల తాపడం ఉత్సవంలో స్వామివారిని ముసుగుతో కప్పి ఉంచుతారు. స్వామివారి ముఖం, పాదాల దర్శనం చేసుకోవచ్చని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

రేపు అడయార్‌లో విద్యుత్ గ్రీవెన్స్

అడయార్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక అడయార్ మండల పరిధిలో గురువారం గ్రీవెన్స్ జరుగనుంది. ఈ మేరకు విద్యుత్ బోర్డు విడుదల చేసిన ప్రకటనలో వివరాలిలా ఉన్నాయి... వేళచ్చేరి మెయిన్ రోడ్డులోని వేళచ్చేరి సబ్ స్టేషన్ ప్రాంగణంలోని ఎస్‌ఈ కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు గ్రీవెన్స్ జరుగుతుందని తెలిపింది. అడయార్ మండల పరిధిలోని విద్యుత్ వినియోగదారులు, విద్యుత్ కోతలు, విద్యుత్ కనెక్షన్లు, విద్యుత్ బిల్లులు సహా విద్యుత్ సంబంధిత సమస్యలు తెలిపి పరిష్కారం పొందవచ్చని విద్యుత్ బోర్డు తెలిపింది.

సెంగోట్టయన్‌కు పోలీసు భద్రత తొలగింపు

పెరంబూర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి సెంగోట్టయన్‌కు ఇచ్చిన సాయుధ దళ పోలీసు భద్రత తొలగించారు. పార్టీకి ద్రోహం చేశారంటూ మాజీ మంత్రి సెంగోట్టయన్‌ను అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి పార్టీ నుంచి బహిష్కరించారు. అనంతరం తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసిన సెంగోట్టయన్ టీవీకేలో చేరారు. ఈ నేపథ్యంలో, సెంగోట్టయన్‌కు కల్పించిన సాయుధ పోలీసు భద్రతను తొలగించారు. దీంతో ఉత్తరాదికి చెందిన ఇద్దరు బౌన్సర్లను, ఆయన ఇంటి వద్ద బందోబస్తుకు నియమించుకున్నారు.

రాష్ట్రంలో జవహర్ నవోదయ పాఠశాలలు

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్చించి నిర్ణయం తీసుకోవాలి: సుప్రీంకోర్టు

పెరంబూర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): తమిళనాడులో జవహర్ నవోదయ విద్యాలయ పాఠశాలల ఏర్పాటుపై కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు చర్చించి నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు సూచించింది. రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో జవహర్ నవోదయ విద్యాలయ పాఠశాల ఏర్పాటుచేసేలా రాష్ట్ర ప్రభుత్వానికి ఉత్తర్వులు జారీచేయాలని, 'కుమారి మహా సభ' అనే సంస్థ తరఫున మద్రాసు హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ పిటిషన్ విచారించిన హైకోర్టు, రాష్ట్రంలో జవహర్ నవోదయ పాఠశాలలు ప్రారంభించేందుకు అనుమతించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ ఉత్తర్వులను సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో అప్పీలు చేసింది. 2017 డిసెంబరు 11న ఈ పిటిషన్ విచారించిన సుప్రీంకోర్టు, మద్రాసు హైకోర్టు ఉత్తర్వులపై తాత్కాలిక నిషేధం విధిస్తూ, తదుపరి విచారణ వాయిదావేసింది. చాలా ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఈ కేసును సోమవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ పీవీ నాగరత్న, జస్టిస్ ఆర్.మహాదేవన్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. కుమారి మహా సభ తరఫున హాజరైన న్యాయవాది ప్రియదర్శిని తన వాదన వినిపిస్తూ దేశవ్యాప్తంగా ఉన్న జవహర్ నవోదయ పాఠశాలల్లో మెరుగైన విద్యాబోధన జరుగుతోందన్నారు. ముఖ్యంగా, గత ఏడాది 'నీట్'కు జవహర్ నవోదయ పాఠశాలల నుంచి 14,183 మంది విద్యార్థులు హాజరుకాగా, వారిలో 11,875 మంది వైద్య కోర్సులకు అర్హత సాధించారని తెలిపారు. అలాంటి నాణ్యమైన పాఠశాలలు తమిళనాడులో ఇప్పటివరకు ప్రారంభించలేదని, అందువల్ల మద్రాసు హైకోర్టు ఉత్తర్వుల మేరకు ఈ పాఠశాలలు రాష్ట్రంలో ప్రారంభించాలి కోరారు.. ఈ వాదనల అనంతరం ధర్మాసనం... విద్యా అనేది ప్రజా జాబితాలో ఉందని, ఈ విషయమై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలసి నిర్ణయం తీసుకోవాలన్నారు. ఈ వ్యవహారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్చించి తగిన నిర్ణయం తీసుకోవాలని ఉత్తర్వులు జారీచేసిన సుప్రీంకోర్టు, తదుపరి విచారణ ఈ నెల 15వ తేదీకి వాయిదావేసింది.



విమానాశ్రయంలో రూ.1.5కోట్ల గంజాయి స్వాధీనం: ఇద్దరి అరెస్ట్

ప్యారీస్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): థాయ్‌లాండ్ నుండి విమానంలో గంజాయిని అక్రమంగా తరలించినఇద్దరిని అరెస్ట్ చేసిన చెన్నై విమానాశ్రయ కస్టమ్స్ అధికారులు వారి నుండి రూ.1.5కోట్ల విలువైన గంజాయి స్వాధీనం చేసుకున్నారు. థాయ్‌లాండ్ నుంచి బయలుదేరిన విమానం మలేసియా మీదుగా స్థానిక త్రిశూలంలోని అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకుంది. ఈ విమానం లోని ప్రయాణికుల లగేజీని కస్టమ్స్ అధికారులు తనిఖీ చేశారు. అందులో ఉత్తరాదికి చెందిన ఇద్దరు యువకులు పర్యాటక వీసాపై థాయ్‌లాండ్ వెళ్లి తిరిగి రాగా, అధికారులు వారిని అనుమానించి తనిఖీ చేయగా లోదుస్తుల్లో దాచి తరలించిన 4కిలోల 113 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. అంతర్జాతీయమార్కెట్‌లో వాటి విలువ రూ.1.5కోట్లు ఉంటుందని కస్టమ్స్ అధికారులు అంచనా వేశారు.

రూ.10 కోట్ల విలువైన ఈ-సిగిరెట్లు స్వాధీనం

పెరంబూర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): చైనా నుంచి తూత్తుకుడికి వచ్చిన నౌకలో, గొడుగులు దిగుమతి చేస్తున్న కంటైనర్లను కేంద్ర ఆర్థిక దర్యాప్తు విభాగం అధికారులు తనిఖీ చేశారు. ఓ కంటైనర్‌లో, గొడుగులకు బదులు ప్రభుత్వం నిషేధించిన ఈ-సిగిరెట్లు గుర్తించారు. బహిరంగ మార్కెట్లో వీటి విలువ రూ.10 కోట్లు ఉంటుందని తెలిపిన అధికారులు, వాటిని స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంలో, కేరళ రాష్ట్రానికి చెందిన నాగరాజ్, చెన్నై కొట్టివాక్కంకు చెందిన రాజ్ కుమార్, మడిపాక్కంకు చెందిన స్వామినాథన్, తదితరులను అధికారులు అరెస్ట్ చేశారు. విచారణ అనంతరం ముగ్గురిని సోమవారం కోర్టులో హాజరుపరచి జైలుకు తరలించారు. ఈ అక్రమ తరలింపుకు సంబంధించిన ప్రధాన నిందితుడి కోసం అధికారులు గాలిస్తున్నారు.

బెయిలుపై వచ్చిన రౌడీ హత్య


అడయార్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): బెయిలుపై విడుదలైన ఖైదీని హతమార్చిన కేసులో 9 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. మదురై మీనాక్షిపురం ప్రాంతానికి చెందిన పాండిదురై (42)పై పలు హత్య, దోపిడీ కేసులున్నాయి. కొద్ది రోజుల క్రితం పాండిదురై, మదురై సెల్లూర్ బోస్‌వీధికి చెందిన మణిరత్నం తండ్రి వద్ద సెల్‌ఫోన్, నగదు దోపిడీ చేశాడు. కేసు నమోదుచేసిన పోలీసులు పాండిదురైను అరెస్ట్ చేసి జైలుకు తరలించారు. 15రోజుల క్రితం పాండిదురై బెయిలుపై విడుదలయ్యారు. సోమవారం సాయంత్రం మీనాక్షిపురం ప్రధాన రోడ్డు సమీపంలో కూర్చున్న పాండిదురైపై మణిరత్నం, అతడి స్నేహితులు మారణాయుధాలతో దాడిచేశారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన పాండిదురైను చుట్టుపక్కల వారు మదురై ప్రభుత్వాసుపత్రికి తరలించగా, అప్పటికే అతను మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సెల్లూరు పోలీసులు కేసు నమోదుచేసి, మణిరత్నం, అతని స్నేహితుడు రాజగురుసహా 9మందిని అరెస్ట్ చేశారు.

ప్రయాణికులు లేక ఏడు విమానాల రద్దు

పెరంబూర్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రయాణికులు లేకపోవడంతో నగరం నుంచి దేశంలోని ఇతర నగరాలు, విదేశాలకు వెళ్లాల్సిన ఏడు విమాన సేవలు రద్దయ్యాయి. కొద్దిరోజులుగా బలమైన గాలులు వీస్తుండడంతో విమానాల రాకపోకల్లో జాప్యం జరిగి ప్రయాణికులు ఇబ్బందులుపడుతున్నారు. ఈ క్రమంలో, ప్రయాణికులు లేకపోవడంతో మంగళవారం 6 స్వదేశీ, ఒక అంతర్జాతీయ విమాన సేవలు రద్దయ్యాయి. ఆ ప్రకారం, అహ్మదాబాద్‌కు ఉదయం 3.55 గంటలు, అండమాన్‌కు 4.40, ముంబైకు 5.25, గౌహతికి 5.30, భువనేశ్వర్‌కు 5.50 గంటలకు బయల్దేరాల్సిన ఇండిగో ఎయిర్‌లైన్స్ విమానాలు రద్దయ్యాయి. అలాగే, కొచ్చిన్ నుంచి నగరానికి రావాల్సిన విమానం రద్దయింది. నగరం నుంచి ఉదయం 4.35 గంటలకు ఇండోనేషియా వెళ్లాల్సిన ఇండిగో ఎయిర్ లైన్స్ అంతర్జాతీయ విమానం రద్దయింది. నిర్వహణ కారణాలరీత్యా విమానాలు రద్దు చేసినట్లు, ఇప్పటికే ఈ విమానాల్లో వెళ్లేందుకు రిజర్వేషన్ చేసుకున్న ప్రయాణికులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసినట్లు ఎయిర్ లైన్స్ అధికారులు తెలిపారు.

11 వరకు 'సర్' ఫారాల సమర్పణకు అవకాశం

- జిల్లా కలెక్టర్ ప్రతాప్



బీఎల్వోలకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న కలెక్టర్ ప్రతాప్

తిరువళ్లూరు, డిసెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): 'సర్' ఫారాలను నింపి ఆన్‌లైన్‌లో పొందుపరిచే గడువు ఈ నెల 11కు పొడిగించినట్లు తిరువళ్లూరు జిల్లా కలెక్టర్ ప్రతాప్ తెలిపారు. సర్ ఫారాలను ఓటర్లకు సకాలంలో పంపిణీ చేసి గడువులోపు వందశాతం ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన బీఎల్వోల అభినందన కార్యక్రమం మంగళవారం కలెక్టరేట్‌లో జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతాప్ మాట్లాడుతూ... జిల్లాలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయన్నారు. సర్ కార్యక్రమంలో అర్హత ఉన్న ఏ ఓటరు పేరు తొలగించే అవకాశం లేదని, అదే సమయంలో అనర్హుల పేర్లు జాబితా నుంచి తొలగిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా సర్ పనులను 100 శాతం పూర్తిచేసిన బీఎల్వోలను కలెక్టర్ అభినందించి, ప్రశంసా పత్రాలు అందజేశారు.

అంతరాయం లేకుండా ఆవిన్ పాల సరఫరా

పెరంబూర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నగరంలో భారీ వర్షాలు కురుస్తున్నా, అంతరాయం లేకుండా పాలు సరఫరా చేస్తున్నట్లు ఆవిన్ సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. వాయుగుండం కారణంగా నగరంలో ఆదివారం రాత్రి నుంచి గాలులతో కూడిన వర్షం కురుస్తోంది. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు కురిసిన వర్షానికి నగరంలోని పలు ప్రాంతాల్లో రోడ్లపై నీరు ప్రవహించింది. వర్షం కొనసాగుతుండడంతో జనజీవనం స్తంభించింది. ఈ క్రమంలో, నగరంలో అంతరాయం లేకుండా పాలు సరఫరా చేస్తున్నట్లు ఆవిన్ సంస్థ తెలిపింది. భారీవర్షం కురుస్తున్నా నగరంలో రోజుకు సరాసరిన 14.50 లక్షల లీటర్ల పాలు సరఫరా చేస్తున్నట్లు ఆవిన్ తెలిపింది.

'విజయ్ కటౌట్'తో టీవీకే సభ్యులకు గుర్తింపు కార్డులు..!



గుర్తింపు కార్డుల పంపిణీ కార్యక్రమంలో విజయ్ కటౌట్

పెరంబూర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మదురైలో తమిళగ వెట్రి కళగం (టీవీకే) సభ్యులకు విజయ్ కటౌట్ ద్వారా గుర్తింపు కార్డులు అందించడం, కటౌట్ వద్ద కార్యకర్తలు సెల్ఫీలు తీసుకుని సంతోషం వ్యక్తం చేశారు. మదురై టీవీకే దక్షిణ జిల్లా ఆధ్వర్యంలో ఏరియా, వార్డు నిర్వాహకులకు గుర్తింపు కార్డుల పంపిణీ కార్యక్రమంలో సోమవారం సాయంత్రం జిల్లా కార్యదర్శి తంగపాండి నేతృత్వంలో జరిగింది. పార్టీ అధ్యక్షుడు విజయ్ 'కటౌట్'తో ఈ కార్యక్రమం నిర్వహించారు. దీనిపై పార్టీ ఐటీ వింగ్ 'విజయ్ లాంటి బొమ్మ సమక్షంలో గుర్తింపు కార్డుల పంపిణి కార్యక్రమం జరిగింది' అని పోస్ట్ చేశారు. ఈ విషయమై స్థానిక నాయకులు మాట్లాడుతూ... విజయ్ ఏ రూపంలో వచ్చినా పర్వాలేదు అని, ఆయన చేతుల మీదుగా గుర్తింపు కార్డులు అందుకున్నామని నమ్ముతున్నామని, ఇది మాకు గర్వంగా ఉందని పేర్కొన్నారు.

ఆవిన్ నెయ్యి ధర ఐదుసార్లు పెంచారు

- పీఎంకే అధ్యక్షుడు అన్బుమణి

ప్యారీస్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ నాలుగున్నరేళ్లలో ఆవిన్ నెయ్యి ధర ఐదుసార్లు పెంచిందని, కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన జీఎస్టీ తగ్గించకుండా వినియోగదారులను మోసం చేసిందని పీఎంకే అధ్యక్షుడు డాక్టర్ అన్బుమణి ఆరోపించారు. ఆయన మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో, దేశంలో మరే రాష్ట్రప్రభుత్వం అమలుపరచని విధంగా డీఎంకే మోడల్ ప్రభుత్వం పన్నులు, నిత్యావసర సరుకుల ధరలు పెంచిందని, ఇందువల్ల మధ్యతరగతి ప్రజలు ఆర్థిక సిబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఆవిన్ ఉత్పత్తుల ధరలు కూడా గుట్టుచప్పుడు కాకుండా పెంచిందని ఆరోపించారు. దీపావళి, పొంగల్ తదితర పండుగల సీజన్‌లో ఆవిన్ ఉత్పత్తులకు ప్రకటించిన సబ్సిడీని కూడా సక్రమంగా అమలుచేయకపోవడాన్ని ప్రజలు గుర్తించారని, రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో తప్పకుండా డీఎంకేకు గుణపాఠం చెబుతారని అన్బుమణి తెలిపారు.

తిరుప్పూర్‌లో టాస్మాక్ బార్ యజమానుల ధర్నా



ధర్నాలో టాస్మాక్ బార్ యజమానులు

ప్యారీస్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మద్యం ఖాళీ సీసాలను ప్రైవేటు సంస్థకు అప్పగించేలా ప్రకటించిన టెండర్ రద్దుచేయాలని కోరుతూ తిరుప్పూర్‌లో టాస్మాక్ బార్ యజమానులు మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. టాస్మాక్ మద్యం చిల్లర దుకాణాల్లో కొనుగోలు చేసే మద్యం సీసాలను తిరిగి అప్పగించి రూ.10 పొందవచ్చని రాష్ట్రప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో ఈ పథకం అన్ని జిల్లాల్లో అమలు జరుగుతోంది. ఈ నేపథ్యంలో, ఖాళీ సీసాలను సేకరించేందుకు ఓ ప్రైవేటు సంస్థకు ఇటీవల టాస్మాక్ అప్పగించిందని ఆరోపిస్తూ తిరుప్పూర్‌లో టాస్మాక్ బార్ల యజమానులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు జిల్లా కలెక్టర్, నగర పోలీస్ కమిషనర్, జిల్లా ఎస్పీలను కలిసి వినతిపత్రం సమర్పించారు.

కాచి చల్లార్చిన నీరు తాగండి

- ఆరోగ్యశాఖ

పెరంబూర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో జ్వరాలు ప్రబలే అవకాశముండడంతో, కాచి చల్లార్చిన నీరు తాగాలని ఆరోగ్యశాఖ ప్రజలకు సూచించింది. అలాగే, రాట్ ఫీవర్ వంటి జ్వరాల బారిన పడకుండా చేతులు, కాళ్లు తరచూ శుభ్రం చేసుకోవాలని తెలిపింది. రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తుండడం, వాతావరణ మార్పుల కారణంగా జ్వరాల బారిన పడుతున్న వారి సంఖ్య అధికమవుతోంది. ఆరోగ్య శాఖ గణాంకాల ప్రకారం, రోజుకు సుమారు 2 లక్షల మందికి పైగా జ్వరం లక్షణాలతో ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. కొందరికి తీవ్రమైన జలుబు, ఫ్లూ వస్తోంది. వర్షాలతో వైరల్ జ్వరాలతో పాటు రాట్ ఫీవర్ బారిన పడే అవకాశముందని ఆరోగ్యశాఖ హెచ్చరిస్తోంది. నిరంతర వర్షాల కారణంగా, ప్రజా పంపిణీ ద్వారా సరఫరా చేస్తున్న తాగునీరు కలుషితం అయ్యే అవకాశముంది. తాగునీటి ట్యాంకుల్లో తగినంత మొత్తంలో క్లోరిన్ కలిపి తాగునీరు సరఫరా చేయాలని స్థానిక సంస్థలకు ఆదేశాలు జారీ అయ్యాయి. అదే సమయంలో, ప్రజలు కూడా కాచి చల్లార్చిన నీరు తాగాలని ఆరోగ్యశాఖ సూచించింది.

అధికారంలోకి రాబోయేది అన్నాడీఎంకే ప్రభుత్వమే

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్



ప్యారీస్, డిసెంబరు 2 (ఆంధ్ర జ్యోతి): వచ్చే ఏడాది జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి మెజారిటీ విజయాన్ని సాధిస్తుందని, అన్నాడీఎంకే తప్పకుండా ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ స్పష్టం చేశారు. మదురైలో ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడుతూ, మతవాదాన్ని గట్టిగా నమ్ముతున్న బీజేపీతో పొత్తు కుదుర్చుకున్నందు వల్ల అన్నాడీఎంకే ప్రభుత్వం ఏర్పడదని డీఎంకే అసత్యప్రచారాలు చేస్తోందని, వాస్తవానికి రాష్ట్రంలో కమలం పార్టీ అభివృద్ధి చెందుతోందన్నారు. రాష్ట్రంలో ఎన్డీయే కూటమిలో ఉన్న అన్నాడీఎంకే ప్రభుత్వం ఏర్పడాలని తాము ఆశిస్తున్నామని, పలు చీలికలుగా విడిపోయిన ఆ పార్టీకి మళ్లీ పూర్వవైభవం వస్తుందన్నారు. మాజీ బీజేపీ రాష్ట్రఅధ్యక్షుడు అన్నామలై ఎట్టి పరిస్థితుల్లోనూ కొత్తగా పార్టీ ప్రారంభించబోరని, ఆయన బీజేపీతో సన్నిహితంగానే ఉన్నారన్నారు.

బీజేపీ క్రమశిక్షణ కార్యాచరణ కమిటీ ఏర్పాటు

అడయార్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ కార్యాచరణ కమిటీని నియమిస్తూ ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ ప్రకటన విడుదల చేశారు. ఆ ప్రకారం, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.చక్రవర్తి అధ్యక్షుడిగా ఉన్న ఈ కమిటీలో రాష్ట్ర కోశాధికారి ఎస్ఆర్ శేఖర్, జాతీయ సర్వసభ్య మండలి సభ్యులు కె.తిరుమలైస్వామి, డా.రాజ్యలక్ష్మి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డా.శివగామి పరమశివం, డి.కుప్పురాములు సభ్యులుగా ఉంటారని ప్రకటనలో తెలిపారు.

కరూర్ ఘటనపై సీబీఐ విచారణ రద్దు చేయండి

- సుప్రీంకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం పిటిషన్

పెరంబూర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కరూర్ ఘటనపై సీబీఐ విచారణ రద్దు చేయాలని సుప్రీంకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం పిటిషన్ వేసింది. కరూర్‌లో టీవీకే అధ్యక్షుడు విజయ్ సెప్టెంబరు 27వ తేది చేపట్టిన ప్రచార సభలో తొక్కిసలాట జరిగి 41 మంది మృతిచెందారు. ఈ కేసు విచారణకు మాజీ న్యాయమూర్తి అరుణా జగదీశన్ నేతృత్వంలో ఏకసభ్య కమిషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. అనంతరం, మద్రాసు హైకోర్టు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసింది. టీవీకే సుప్రీంకోర్టును ఆశ్రయించి, సీబీఐ విచారణ కోరింది. ఈ పిటిషన్ విచారించిన సుప్రీంకోర్టు, కరూర్ ఘటనపై సీబీఐ విచారణకు ఆదేశించింది. ప్రస్తుతం సీబీఐ అధికారులు కరూర్‌లో మకాం వేసి విచారణ వేగవంతం చేశారు. ఈ నేపథ్యంలో, సీబీఐ విచారణ రద్దు చేయాలంటూ సుప్రీంకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం పిటిషన్ దాఖలుచేసింది. ఈ పిటిషన్‌లో... మద్రాసు హైకోర్టు ఏర్పాటుచేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం విచారణ మళ్లీ ప్రారంభించేలా అనుమతించాలి, అరుణా జగదీశన్ నేతృత్వంలోని ఏకసభ్య కమిషన్ విచారణ మళ్లీ చేసేలా ఉత్తర్వులివ్వాలని కోరింది. అలాగే, ఈ కేసులో సీబీఐ విచారణ సత్వరం రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం పిటిషన్‌లో కోరింది. ఈ పిటిషన్ త్వరలో విచారణకు రానుందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

కూరగాయల సాగులో విద్యార్థులు



పాఠశాల ప్రాంగణంలో కూరగాయల సాగులో విద్యార్థులు

పెరంబూర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): విరుదునగర్ జిల్లా కారియపట్టి మల్లంగినర్ ప్రభుత్వ మహోన్నత పాఠశాలల్లో 'గ్రీన్ స్కూల్' పథకంలో విద్యార్థులు కూరగాయల సాగు చేపడుతున్నారు. ఈ పాఠశాలలో సుమారు 600 మంది విద్యార్థులు చదువుతున్నారు. గ్రీన్ స్కూల్ పథకంలో భాగంగా పాఠశాల ప్రాంగణంలో పలురకాల కాయగూరలు సాగు చేస్తున్నారు. పండించిన కాయగూరలను ప్రతిరోజు పౌష్టికాహార కేంద్రానికి తరలించి, వంటలకు వినియోగిస్తున్నారు. పాఠశాల ప్రాంగణంలో సౌర విద్యుత్ కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ విషయమై పాఠశాల విద్యార్థిని దర్శిని మాట్లాడుతూ... మన శ్రమతో పండించిన కూరగాయలు వండుకుని తినేటప్పుడు, అవి ఎంత విలువైనవో తెలిసిందన్నారు. తోట పెంపకం మనస్సుకు సంతోషం, ప్రశాంతత అందజేస్తుందని తెలిపారు. మన చుట్టూ పచ్చటి వాతావరణం సృష్టిస్తే, ప్రకృతి మనకు సురక్షితమైన వాతావరణం అందిస్తుంది అనడంలో సందేహం లేదని తెలిపారు.

రోడ్డు కోసం ఎమ్మెల్యేతో వాగ్వాదం



ఎమ్మెల్యే మహారాజన్‌తో గ్రామస్తుల వాగ్వాదం

ప్యారీస్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): తేని జిల్లా ఆండిపట్టి తాలూకా మైలాడుంపారై యూనియన్ పరిధిలోని వరసనాడు-వాలిప్పారై మధ్య రోడ్డు నిర్మించాలని డిమాండ్ చేస్తూ ఎమ్మెల్యే మహారాజన్‌ను మంగళవారం గ్రామస్తులు చుట్టుముట్టి ఆయనతో వాగ్వాదానికి దిగారు. వరసనాడు-వాలిప్పారై మధ్య రోడ్డు నిర్మించేందుకు అటవీ శాఖ అభ్యంతరం తెలపడంతో జిల్లా కలెక్టర్ ఆ స్థలాన్ని పరిశీలించి రోడ్డు నిర్మించవచ్చని రహదారుల శాఖ అధికారులకు ఆదేశించారు. అయినప్పటికి రోడ్డు నిర్మించేందుకు అటవీశాఖ అనుమతించకపోవడంతో 18 గ్రామాల ప్రజలు సుమారు 12 కిలోమీటర్ల దూరం అదనంగా తిరిగి రావాల్సిన పరిస్థితి నెలకొంది. దీనిపై పలు దశలుగా పోరాటాలు సాగించిన గ్రామస్తులు, తమ ఇళ్లపై నల్లజెండాలు ఎగురవేసి, గ్రామసభలను సైతం బహిష్కరించారు. అంతేకాకుండా తమ కోరకలను నెరవేర్చకుంటే రానున్న అసెంబ్లీ ఎన్నికలను కూడా బహిష్కరించనున్నట్లు వారు ప్రకటించారు. ఈ నేపథ్యంలో, మంగళవారం ఉదయం వరసనాడు, తుమ్మగుండు తదితర ప్రాంతాల్లో వర్షానికి దెబ్బతిన్న గ్రామాలను ఆండిపట్టి ఎమ్మెల్యే మహారాజన్ పరిశీలించారు. అక్కడికి చేరుకున్న మైలాడుంపారై గ్రామస్తులు ఎమ్మెల్యేను చుట్టుముట్టి రోడ్డు నిర్మాణం పనుల్లో ఎందుకు జాప్యం జరుగుతుందని నిలదీసి ఆయనతో వాగ్వాదానికి దిగారు. దీంతో దిగ్భ్రాంతి చెందిన ఎమ్మెల్యే, ఆయన అనుచరులు ప్రజలతో చర్చించి మరో 15 రోజుల్లో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరింపజేస్తామని హామీ ఇచ్చారు. దీనితో ఆందోళనకారులు అక్కడనుండి వెనుదిరిగారు.

వలస కార్మికులకు ఓటు హక్కు ఇవ్వొద్దని నేటినుంచి ఆమరణ నిరాహారదీక్ష

- నటుడు మన్సూర్ అలీఖాన్



ప్యారీస్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కోసం ఉత్తరాది నుండి వలస వచ్చిన కార్మికులకు రాష్ట్రంలో ఓటు హక్కు కల్పించరాదని డిమాండ్ చేస్తూ బుధవారం నుంచి ఎగ్మూరు రాజరత్నం స్టేడియం వద్ద ఆమరణ నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు సినీ నటుడు నటుడు మన్సూర్ అలీఖాన్ ప్రకటించారు. ఆయన నగరంలో మంగళవారం మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్ర ప్రజల హక్కులను హరించేలా వ్యవహరిస్తున్న కేంద్ర ఎన్నికల కమిషన్ (ఈసీ), కేంద్ర ప్రభుత్వ తీరును ఖండిస్తూ నగరంలో ఆమరణ నిరాహారదీక్ష చేయనున్నట్టు తెలిపారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకేకు మద్దతుగా తాను విస్తృతంగా ప్రచారం చేసి, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్ళనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో చేపట్టిన సర్ పనులకు అన్ని వర్గాలనుండి వ్యతిరేకత వస్తోందని, అయినప్పటికి ఈసీ దీనిపై స్పందించలేదని ఆరోపించారు.

తిరుప్పరంకుండ్రం శిఖరంపై మహాదీపం వెలిగించాలి

- మద్రాస్ హైకోర్టు మదురై బెంచ్ ఉత్తర్వులు



తిరుప్పరంకుండ్రం ఆలయం

ప్యారీస్, డిసెంబరు 2 (ఆంధ్ర జ్యోతి): ఆలయాల నగరం మదురైలోని తిరుప్పరంకుండ్రంలో బుధవారం కార్తిక దీపోత్సవం సందర్భంగా కొండ శిఖరంపై ఉన్న దీపస్తంభంలో మహా దీపం వెలిగించేందుకు మద్రాస్ హైకోర్టు మదురై బెంచ్ ఉత్తర్వులు జారీచేసింది. మదురైకు చెందిన ఏలుమలై అనే భక్తుడు హైకోర్టు మదురై బెంచ్‌లో దాఖలు చేసిన పిటిషన్‌లో డిసెంబరు 3న జరిగే కార్తిక దీపోత్సవం సందర్భంగా తిరుప్పరంకుండ్రం కొండ శిఖరంపై మహాదీపం వెలిగించకుండా వినాయకుడి ఆలయంలోని దీప మండపంలో వెలిగించేందుకు ఆలయ నిర్వాహకులు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ పిటిషన్ సోమవారం న్యాయమూర్తి జీఆర్ స్వామినాథన్ సమక్షంలో విచారణకు రాగా, పిటిషనర్ తరుపు న్యాయవాది హాజరై తరతరాల నుండి కొనసాగుతున్న సంప్రదాయాన్ని పాటించేలా ఆలయ నిర్వాహకులకు ఆదేశించాలని కోరారు. ఈ అభ్యర్థన మేరకు దర్గాకు 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న తిరుప్పరంకుండ్రం కొండ శిఖరంపై ఉన్న దీపస్తంభంలో మహాదీపం వెలిగించాలని న్యాయమూర్తి ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

అమలులోకి ఈ-ఫైలింగ్ విధానం

- బారులు తీరిన న్యాయవాదులు



ఈ-ఫైలింగ్ కోసం సేవా కేంద్రాల వద్ద బారులుతీరిన న్యాయవాదులు

పెరంబూర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): న్యాయస్థానాల్లో ఈ-ఫైలింగ్ విధానంలో కేసులు నమోదు చేసే విధానం సోమవారం నుంచి తప్పనిసరి చేశారు. ఈ కారణంగా, న్యాయవాదులు క్యూలైన్లలో వేచి కేసులు నమోదుచేశారు. కేసులు నేరుగా దాఖలుచేసే ప్రక్రియలో మార్పులు చేసి, ఈ-ఫైలింగ్ చేసే ప్రక్రియ 2024 సెప్టెంబరు నుంచి అనుసరిస్తున్నారు. సర్వర్ సమస్యలు, సాంకేతిక లోపాలు, తగినంత శిక్షణ లేకపోవడంతో తదితర కారణంగా ఈ ప్రక్రియ నిలిపివేయాలని బార్ అసోసియేషన్ విజ్ఞప్తి మేరకు, రెండేళ్లుగా ఈ-ఫైలింగ్ విధానం నిలిపివేశారు. ఈ క్రమంలో, డిసెంబరు 1 నుంచి ఈ-ఫైలింగ్ తప్పనిసరి అని మద్రాసు హైకోర్టు ప్రకటించింది. దీనిని ఆపాలంటూ బార్ అసోసియేషన్ జాయింట్ కమిటీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి అభ్యర్థించినా, దానిని ఆమోదించలేదు. హైకోర్టు ఉత్తర్వుల మేరకు, ఎలక్ట్రానిక్‌గా కేసు దాఖలుచేసే ప్రక్రియ సోమవారం నుంచి అమలుకు వచ్చింది. కోవై కోర్టు ప్రాంగణంలో, ఈ-ఫైలింగ్ కోసం ఐదు సహాయ కేంద్రాలు ఏర్పాటుచేశారు. న్యాయవాదులు క్యూలైన్లలో వేచి ఉంచి ఈ-ఫైలింగ్ విధానంలో కేసులు దాఖలుచేశారు.

కరూర్‌లో జస్టిస్ అజయ్ రస్తోగి బృందం

- ప్రజల నుండి వినతుల స్వీకరణ

ప్యారీస్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కరూర్ వేలుస్వామిపురం తొక్కిసలాట ఘటనలో 41 మంది మృతిచెందిన ప్రాంతాన్ని జస్టిస్ అజయ్ రస్తోగి నేతృత్వంలోని దర్యాప్తు బృందం మంగళవారం పరిశీలించింది. టీవీకే అధ్యక్షుడు విజయ్ సెప్టెంబరు 27న కరూర్‌లో నిర్వహించిన రోడ్‌షోలో తొక్కిసలాట జరిగి 41 మంది ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఈ దుర్ఘటనకు సంబంధించి నమోదైన కేసును సుప్రీంకోర్టు సీబీఐకి అప్పగించింది. సీబీఐ అధికారులు దర్యాప్తు ప్రారంభించి ఇప్పటివరకు పోలీసులు, అంబులెన్స్ యజమానులు, డ్రైవర్లు, క్షతగాత్రులు, మృతుల కుటుంబ సభ్యులను విచారణ జరిపారు. ఈ నేపథ్యంలో, సీబీఐ విచారణ పర్యవేక్షణకు సీబీఐ డీఐజీ అతుల్‌కుమార్ ఠాకూర్ ఇప్పటికే కరూర్‌లో మకాంవేసిన నేపథ్యంలో సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి అజయ్ రస్తోగిలతో కూడిన ప్రత్యేక కమిటీని నియమించింది. ఈ కమిటీ మంగళవారం ఉదయం కరూర్ చేరుకోగా, దుర్ఘటనకు సంబంధించి వివరాలతో కూడిన వినతిపత్రాలను స్థానికులు ఈ కమిటీకి సమర్పించారు.

సోషల్ మీడియా అంటే భయపడుతున్నారు : శివకార్తికేయన్



ఫ్యాన్లీ యాప్ ఆవిష్కరణ దృశ్యం

ఇపుడు సోషల్ మీడియా అంటే ప్రతి ఒక్కరూ భయంతో వణికిపోతున్నారని హీరో శివకార్తికేయన్ అన్నారు. ఫ్యాన్లీ ఎంటర్‌టైన్మెంట్ యాప్ ఆవిష్కరణ కార్యక్రమం నగరంలో జరిగింది. ఇందులో శివకార్తికేయన్ మాట్లాడుతూ, 'నాతో పాటు ఈ వేదికపై ఉన్న ముగ్గురికి తెలివితేటలు ఎక్కువ. నాకు తక్కువ. అందువల్లే నటుడిగా కొనసాగుతున్నాను. తెలివితేటలు ఎక్కువగా ఉన్నట్టయితే దర్శకులను వేధించేవాడిని. ఇపుడు వారు చెప్పినట్టుగా నడుచుకుంటున్నాను. నన్ను దేవుడుగా ఆరాధించే అభిమానులు నాకు అక్కర్లేదు. తల్లిదండ్రులను, దేవుడిని పూజిస్తూ, ప్రేమగా మాట్లాడితే చాలు. ఒక సోదరుడిగా ఉండేందుకే ఇష్టపడుతున్నాను. అందుకే ఎల్లవేళలా తమ్ముళ్ళు, చెల్లెళ్ళు అంటూ సోదర భావంతో పిలుస్తుంటాను. ఇపుడు సోషల్ మీడియా చూస్తేనే భయంగా ఉంటుంది. అన్ని సామాజిక మాధ్యమాల్లో నాకు ఖాతాలున్నాయి. కానీ, వాటిని వేర్వేరు వ్యక్తులు నిర్వహిస్తున్నారు. ఇన్‌స్టా వైపు వెళ్లాలంటేనే భయంగా ఉంది. పొరపాటున ఏదైనా తప్పు దొర్లితే అది వైరల్‌గా మారుతోంది. పైగా మనం ఎపుడు తప్పు చేస్తామా, నోరు జారుతామా అని కొందరు ఎదురు చూస్తున్నారు. అలాంటి వారికి చిక్కకుండా ఉండేందుకు సోషల్ మీడియా వైపు వెళ్లడం లేదు' అని పేర్కొన్నారు. కాగా, ఈ ఫ్యాన్లీ ఎంటర్‌టైన్మెంట్ యాప్‌ను శివకార్తికేయన్‌తో కలిసి పద్మభూషణ్ పుల్లెల గోపీచంద్, వరల్డ్ చెస్ చాంపియన్, మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న పురస్కార గ్రహీత గుకేష్, ఉబెర్ క్యాబ్ సీనియర్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మణికంఠన్ తంగరత్నం, ఫ్యాన్లీ యాప్ నిర్వాహకులు శరవణన్ కనకరాజు, శ్రీనివాసన్ బాబు తదితరులు కలిసి ఆవిష్కరించారు.


విమల్, సృష్టి, మహిమా గుప్తా

12న 'మహాసేన' విడుదల

మరుదమ్ ప్రొడక్షన్స్ పతాకంపై యాక్షన్ థ్రిల్లర్ మూవీ 'మహాసేన'. ఈ నెల 12న విడుదలకానుంది. దీన్ని పురస్కరించుకుని ఈ చిత్రం ఆడియో, ట్రైలర్ తాజాగా రిలీజ్ చేశారు. 2023లో విడుదలై ఘన విజయం సాధించిన 'రాహాదాన్' మూవీ తర్వాత మరుదమ్ ప్రొడక్షన్ నిర్మించిన రెండో చిత్రం ఇది. దినేష్ కలైసెల్వన్ కథ సమకూర్చి దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఆధ్యాత్మికం, ప్రకృతి, అటవీ వారసత్వం, మానవ జీవన విధానాల సమ్మేళనంతో భారీ యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందించారు. కూడలూరు, వయనాడు, కొల్లిమలై, ఊటీ తదితర ప్రాంతాల్లో 90 శాతం చిత్రీకరణ జరుపుకుంది. గ్రాండ్ ఫెస్టివల్ క్లైమాక్స్, భావోద్వేగ కథాంశం, హైటెక్ సిజీఐ విధానంలో ప్రేక్షకులను ఆశ్చర్యపరిచేలా రూపొందించారు. విమల్, సృష్టి డాంగే, యోగిబాబు, మహిమా గుప్తా, జాన్ విజయ్, కబీర్, దుహాన్ సింగ్, ఆల్ఫ్రెడ్ జోస్, శివకృష్ణ, ఇలక్య తదితరులు నటించగా, సేన అనే ఏనుగు మరో ముఖ్య పాత్ర పోషించింది. ఈ చిత్ర విశేషాలను దర్శకుడు వివరిస్తూ, 'మహాసేన' అనేది విశ్వాసం, శక్తి, ప్రకృతి సమతుల్యతను వివరించే మూవీ. అడవిలో ఉండే ఆధ్యాత్మిక భావన, ఆత్మను ప్రేక్షకులను మరో లోకంలోకి తీసుకెళ్లే ఒక మంచి చిత్రంగా ఉంటుంది' అని పేర్కొన్నారు.

ఫీనిక్స్ మాల్‌లో శ్రీలీల సందడి

ప్రముఖ సినీ నటి శ్రీలీల వేళచ్చేరిలోని ఫీనిక్స్ మార్కెట్‌లో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో సందడి చేశారు. నిత్యం వెండితెరపై చూసే తమ అభిమాన నటి కళ్ల ముందు తళుక్కుమనడంతో అభిమానుల ఆనందానికి హద్దే లేకుండాపోయింది. ఒకవైపు విద్యుద్దీపాల ప్రకాశం, మరోవైపు డీజే సుకేతు సంగీతంతో కలిసి అభిమానుల సందడి మాల్‌ను హోరెత్తించింది. ప్రాంగణమంతా నృత్యవేదికగా మారిపోయింది. సందర్శకులు ఆటలు, పాటలతో శ్రీలీలను మెప్పించేందుకు పోటీపడ్డారు. అంతేగాక ఆమెతో సెల్ఫీలు దిగేందుకు బారులు తీరారు.



చిత్రజ్యోతి

'రెయిన్ బో'లో హైరిస్క్ ప్రెగ్నెన్సీ యూనిట్

చెన్నై, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక అన్నానగర్‌లోని రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్‌లో 'సుభిక్షా' పేరుతో హైరిస్క్ ప్రెగ్నెన్సీ యూనిట్ ఏర్పాటైంది. ఈ యూనిట్‌ను మంగళవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ వీకే శాంత, డాక్టర్ శోభన, డాక్టర్ అనూరాధ, డాక్టర్ సునీత, డాక్టర్ లోగప్రభు నందిని, డాక్టర్ నిఖితా బొజ్జా, ఆసుపత్రి తమిళనాడు, ఏపీ జోనల్ డైరెక్టర్ భాస్కర్‌రెడ్డి తదితరులు మీడియాతో మాట్లాడుతూ.. అధిక ప్రమాదకర గర్భధారణలకు సకాలంలో గుర్తింపు, నిపుణుల జోక్యం, బహుళ నిపుణుల మధ్య సజావుగా సమన్వయం అవసరమని, సుభిక్షతో తాము రక్తపోటు, మధుమేహం, థైరాయిడ్ రుగ్మతలు, ఆటో ఇమ్యూన్ వంటి బహుళ సమస్యలతో తల్లుల సంరక్షణ చూడలుగుతున్నామన్నారు. తమ నియోనాటాలజీ బృందం మొదటి నుంచి ప్రసూతి వైద్య నిపుణులతో కూడివుందన్నారు. అన్నానగర్ పరిసరాల్లోని కుటుంబాలకు ప్రత్యేకమైన ప్రసూతి, నవజాత శిశువు సేవల విస్తరించేందుకు తమ నిబద్ధతను ఈ యూనిట్ ప్రారంభించడం ప్రతిబింబిస్తుందని వివరించారు.



సుభిక్షా యూనిట్ ప్రారంభిస్తున్న వైద్యనిపుణులు

స్వీయ-రోగ నిర్ధారణ కోసం 'ప్రత్యేక చిప్'

- ఆవిష్కరించిన 'వీఐటీ చెన్నై'


వీఐటీ బృందానికి చిప్ అందిస్తున్న కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్

చెన్నై, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పోర్టబుల్ వైద్య పరికరాల్లో అనుసంధానించగల ప్రత్యేకమైన చిప్‌ను వీఐటీ చెన్నై ఆవిష్కరించింది. వీఐటీ చెన్నైలోని 'సెంటర్ ఫర్ నానో ఎలక్ట్రానిక్స్ అండ్ వీఎల్ఎస్ఐ డిజైన్' (సీఎన్‌వీడీ) స్వీయ-రోగ నిర్ధారణ అప్లికేషన్ కోసం పోర్టబుల్ వైద్య పరికరాల్లో అనుసంధానించగల ప్రత్యేకమైన మిక్స్‌డ్-సిగ్నల్ రీడౌట్ ఇంటర్‌ఫేస్ (రోల్) చిప్‌ను ఆవిష్కరించింది. ఈ చిప్ అనలాగ్, డిజిటల్ సర్క్యూట్‌లను అనుసంధానించి, రెండు డిజైన్ల ప్రయోజనాలను ఉపయోగించుకుంటుంది. తద్వారా హృదయ స్పందన రేటు, రక్తపోటు సహా ఆరోగ్య సంరక్షణ కోసం మైక్రో ఎలక్ట్రో మెకానికల్ సిస్టమ్స్ సెన్సార్ల శ్రేణి ద్వారా వినియోగదారుల భౌతిక పరిమితులను సమర్థవంతంగా ఎంచుకుని ప్రాసెస్ చేస్తుంది. దీని గురించి వీఐటీ ఉపాధ్యక్షుడు డాక్టర్ జీవీ సెల్వం మాట్లాడుతూ.. వీఐటీ చెన్నై సామాజిక పురోగతికి ప్రత్యక్షంగా దోహదపడే బహుళ విభాగ పరిశోధనలకు బలమైన, వ్యూహాత్మక ప్రాధాన్యత నిస్తుందన్నారు. తమ అధ్యాపకులు, విద్యార్థులు సమాజం ఎదుర్కొంటున్న సవాళ్లకు ఆచరణాత్మక, వాస్తవ ప్రపంచ పరిష్కారాలను అభివృద్ధి చేయడానికి చురుగ్గా సహకరిస్తారని తెలిపారు. వీఐటీ చెన్నైలో సమాజ ఆధారిత పరిశోధన పట్ల తమ నిబద్ధత కేవలం విద్యాపరమైన అన్వేషణ కాదని, ఇది జీవితాలను మార్చే జ్ఞానాన్ని సృష్టించడానికి తమను నడిపించే ప్రధాన విలువగా వ్యాఖ్యానించారు. వీఐటీ చెన్నై ప్రొ వైస్‌ఛాన్సలర్ డాక్టర్ టి.త్యాగరాజన్ మాట్లాడుతూ.. వీఐటీ చెన్నై అనువాద పరిశోధనలపై బలమైన దృష్టి పెట్టడం వల్ల వీఎల్ఎస్ఐ డిజైన్ నుంచి అధ్యాపక బృందం ఇటీవల మొహాలిలోని సెమీ కండక్టర్ లేబోరేటరీలో డ్యూయల్ డిజైన్-స్టయిల్ విధానాన్ని ఉపయోగించి రూపొందించిన స్వదేశీ చిప్‌ను విజయవంతంగా ప్రయోగించిందన్నారు. ఆ కార్యక్రమంలో కేంద్ర ఐటీ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఈ చిప్‌ను అధికారికంగా వీఐటీ చెన్నై బృందానికి అందజేసినట్లు వివరించారు.


పూజల్లో రైల్వే అధికారులు, సిబ్బంది

గ్యారేజ్‌లో వందే భారత్ రైలుకు పూజలు

పెరంబూర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): తిరుచ్చి పొన్‌మలై రైల్వే గ్యారేజ్‌కు తొలిసారిగా వందే భారత్ రైలు వచ్చింది. తిరుచ్చి పొన్‌మలైలో ఉన్న రైల్వే గ్యారేజీలో రైలు బోగీలకు మరమ్మతులు, ఊటీ కొండ రైలు ఇంజన్ల తయారీ, రైల్వే ఇంజన్లకు మరమ్మతులు చేపడుతుంటారు. ఈ నేపథ్యంలో, ఈ గ్యారేజీకి తొలిసారి 16 బోగీలతో కూడిన వందే భారత్ రైలు మరమ్మతుల కోసం వచ్చింది. 2022 నుంచి చెన్నై నుంచి తిరువనంతపురం మధ్య నడుపుతున్న ఈ రైలు, ప్రస్తుతం నిర్వహణ కోసం తిరుచ్చి రైల్వే గ్యారేజీకి తీసుకొచ్చారు. పొన్‌మలై రైల్వే గ్యారేజ్ అధికారులు, ఉద్యోగులు ప్రత్యేక పూజలతో వందే భారత్ రైలుకు స్వాగతం పలికారు. మూడేళ్లకు ఒకసారి వందే భారత్ రైళ్లకు మరమ్మతులు చేపడుతుంటారు.

ఘనంగా శక్తిగణపతి ఆలయ మహాకుంభాభిషేకం

తిరుత్తణి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి శేఖరవర్మ నగర్‌లోని శక్తిగణపతి ఆలయ జీర్ణోద్ధరణ పనులు ఇటీవల పూర్తయ్యాయి. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా కుంభాభిషేకం జరిగింది. మంగళవారం ఉదయం మూలమూర్తికి ప్రత్యేక పూజల అనంతరం పండితుల వేదమంత్రోచ్చారణ, మంగళవాయిద్యాల నడుమ ఆలయ కలశంపై అర్చకులు పుణ్యనదీ జలాలను సంప్రోక్షించి కుంభాభిషేకాన్ని నిర్వహించారు. ఈ వేడుకలను చూసేందుకు చుట్టు పక్కల గ్రామాల భక్తులు పెద్దఎత్తున ఆలయానికి తరలివచ్చారు. అనంతరం ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు.


కుంభాభిషేకం చేస్తున్న అర్చకులు

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేద్దాం

- రఘువీరారెడ్డి

చెన్నై, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): తమిళనాట కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు నేతలు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని ఆ పార్టీ ఆలిండియా వర్కింగ్ కమిటీ సభ్యులు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి ఎన్.రఘువీరా రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం ట్రిప్లికేన్-చేపాక్కం నియోజకవర్గ సమావేశం జరగ్గా.. వివిధ విభాగాల పునర్నిర్మాణం కోసం అభిప్రాయసేకరణ జరిగింది. ఈ సందర్భంగా రఘువీరారెడ్డి మాట్లాడుతూ.. నేతలంతా సమైక్యంగా కృషి చేసి పార్టీని బలోపేతం చేయాలని సూచించారు. ఇదిలా వుండగా ట్రిప్లికేన్‌కు చెందిన తెలుగు ప్రముఖులు పి.పాల్ కొండయ్య నేతృత్వంలో పి.చిన్నయ్య, పి.అరుణ్‌కుమార్ తదితరులు రఘువీరారెడ్డిని కలిసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌సీసీ మాజీ అధ్యక్షుడు తంగబాలు తదితరులు పాల్గొన్నారు.




రఘువీరారెడ్డితో తెలుగు ప్రముఖులు

ఐడీఎఫ్ వర్కింగ్ గ్రూప్ చైర్‌పర్సన్‌గా డాక్టర్ అంజన



అంజనకు నియామకపత్రం అందజేస్తున్న డాక్టర్ పీటర్ స్వార్జ్, డాక్టర్ మోహన్

అడయార్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): 'ఇంటర్నేషనల్ డయాబెటీస్ ఫెడరేషన్' (ఐడీఎఫ్) వర్కింగ్ గ్రూప్ ఆఫ్ ఫిజికల్ యాక్టివిటీస్ చైర్‌పర్సన్‌గా డాక్టర్ మోహన్స్ డయాబెటీస్ స్పెషాలిటీస్ సెంటర్ మేనేజింగ్ డైరెక్టర్, మద్రాస్ డయాబెటీస్ రీసెర్చ్ ఫౌండేషన్ అధ్యక్షురాలు డాక్టర్ ఆర్ఎం అంజన నియమితులయ్యారు. ఈ మేరకు ఐడీఎఫ్ అధ్యక్షుడు ప్రొఫెసర్ పీటర్ స్వార్జ్ ఇటీవల నియామక పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మధుమేహాన్ని నివారించడానికి, ప్రపంచ ఆరోగ్యాన్ని పెంపొందించడానికి శారీరక శ్రమ ఎంతో అవసరమన్నారు. ఐడీఎఫ్ ప్రపంచ వ్యాప్తంగా నిష్క్రియాత్మకతను పరిష్కరించడానికి డాక్టర్ అంజన నేతృత్వంలో ఐడీఎఫ్ వర్కింగ్ గ్రూపు పని చేస్తుందని వివరించారు. డాక్టర్ అంజన మాట్లాడుతూ.. ఫిజికల్ యాక్టివిటీస్‌పై ఐడీఎఫ్ వర్కింగ్ గ్రూప్‌నకు అధ్యక్షత వహించడం చాలా గౌరవంగా భావిస్తున్నానన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ మోహన్స్ డయాబెటీస్ స్పెషాలిటీస్ సెంటర్, మద్రాస్ డయాబెటీస్ రీసెర్చ్ ఫౌండేషన్ ఛైర్మన్ డాక్టర్ వి.మోహన్ ప్రత్యేకంగా అభినందించారు.


వార్డులో ఆహారం అందిస్తున్న మేయర్ ప్రియ

వరద ప్రభావిత ప్రాంతాల్లో ఆహారం సరఫరా : జీసీసీ

ప్యారీస్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నగరంలో వర్షపునీరు చేరిన ప్రాంతాల్లో 5లక్షలకు పైగా ఆహార పొట్లాలు పంపిణీ చేసినట్లు గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ ప్రకటించింది. దిత్వా తుపాను వాయుగుండంగా మారడంతో నగరంలో గత మూడు రోజులుగా ఎడతెరపిలేకుండా వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాల్లో వర్షపునీరు భారీగా చేరడంతో ఆ ప్రాంత ప్రజలకు జీసీసీ ఆహారం, తాగునీరు, వైద్య సదుపాయాలు సమకూర్చింది. మేయర్ ప్రియ ప్రభావిత ప్రాంతాలను పరిశీలించి, ఆహార పంపిణీ పర్యవేక్షించారు. వాతావరణశాఖ హెచ్చరికలతో నగరంలో ముందుగానే ఏర్పాటు చేసిన 215 సహాయక శిబిరాల్లో ఆశ్రయం పొందుతున్న ప్రజలకు ఉదయం, సాయంత్రం అల్పాహారం, మధ్యాహ్నం భోజనాన్ని పంపిణీ చేశారు. మంగళవారం ఉదయం 2, 23,500 మందికి ఆహార పొట్లాలు ఆయా శిబిరాలకు అధికారులు పంపిణీ చేశారు. స్థానిక బేసిన్‌బ్రిడ్జ్ ప్రాంతంలో ఉన్న జీసీసీ వంటశాలలో తయారుచేసిన వంటకాలను మూడు రోజుల్లో 5లక్షల, 106 మందికి పంపిణీ చేసినట్లు అధికారులు తెలిపారు.

చెన్నైపోర్ట్ చైర్మన్‌గా ఎస్.విశ్వనాథన్

ప్యారీస్, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): చెన్నైపోర్ట్ చైర్మన్‌గా రాష్ట్రానికి చెందిన ఎస్.విశ్వనాథన్ బాధ్యతలు స్వీకరించారు.చెన్నై, కామరాజర్ పోర్టుల చైర్మన్‌గా వ్యవహరించిన సునీల్ పాలివాల్ కేంద్ర నౌకాయాన మంత్రిత్వశాఖకు బదిలీ అయ్యారు.దీంతోఖాళీ అయిన చెన్నైపోర్ట్ చైర్మన్‌గా ప్రస్తుతం వైస్ చైర్మన్‌గా ఉన్న ఎస్.విశ్వనాథన్ నియమితులయ్యారు. సోమవారం బాధ్యతలు స్వీకరించిన విశ్వనాథన్‌కు పలుశాఖల ఉన్నతాధికారులు శుభాకాంక్షలు తెలిపారు. కోయంబత్తూరుకు చెందిన విశ్వనాథన్ 2008లో మధ్యప్రదేశ్‌లో ఐఏఎస్ అధికారిగా ఎంపికయ్యారు. జాతీయ ఆరోగ్యశాఖ డైరెక్టర్‌గా, గౌహతి మున్సిపల్ కమిషనర్‌గా, పర్యాటకశాఖ నిర్వాహక డైరెక్టర్‌గా, ఆయుష్మాన్ భారత్ ప్రధాన అధికారిగా ఆయన పనిచేశారు. ఆయన సేవలను గుర్తించి కేంద్రప్రభుత్వం రెండు అవార్డులను కూడా ప్రదానం చేసింది. విశ్వనాథన్ ఓడరేవుల మంత్రిత్వశాఖలోని మెరైన్ ఇండియా ట్రస్ట్ ఎండీగా కూడా పనిచేయడం గమనార్హం.

స్తంభించిన జనజీవనం

- దిత్వా తుఫాన్ ఎఫెక్ట్..

నివారణ చర్యలు ముమ్మరం


నత్తంబేడులో భారీగా చేరిన వరదనీరు

ప్యారీస్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): దిత్వా తుపాను ప్రభావంతో రాజధాని నగరంలో జనజీవనం స్తంభించింది. ప్రధాన రహదారులు, బస్టాండ్లు, సంత వీధులు, లోతట్టు ప్రాంతాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. మూడు రోజులుగా ఎడతెరపిలేకుండా కురుస్తున్న వర్షానికి ఉత్తర, మధ్య, దక్షిణ చెన్నై ప్రాంతాలు జలమయమయ్యాయి. నగర పురపాలక సంఘం ప్రధాన కార్యాలయం రిప్పన్ బిల్డింగ్ వద్దనున్న రోడ్లలో భారీగా వరదనీరు నిలిచింది. పెరియమెట్ ప్రాంతంలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం, ఇండోర్ స్టేడియం ప్రాంగణాలు, పెరియమెట్‌లో ఉన్న మసీదులు, చర్చిల్లో వరదనీరు చేరింది. అలాగే నగరంలోని 200 వార్డుల్లో భారీ వర్షం కారణంగా ప్రజలు ఇబ్బందుల పాలవుతున్నారు. జీసీసీ, తమిళనాడు విద్యుత్ బోర్డు (టీఎన్ఈబీ), రహదారులు, నీటిపారుదల, అగ్నిమాపక తదితర శాఖల ఉద్యోగులు సమన్వయంతో నివారణ పనుల్లో పాల్గొంటున్నారు. గాలులకు నేలకొరిగిన చెట్లను, పలు ప్రాంతాల్లో చేరిన వర్షపునీటిని తొలగిస్తున్నారు. దిత్వా తుపాను బలహీనపడి తీవ్ర వాయుగుండంగా మారిన తర్వాత బంగాళాఖాతంలో తీరానికి సమాంతరంగా అతి నెమ్మదిగా పయనిస్తూ రాష్ట్రం, పుదుచ్చేరికి అతిచేరువుగా వచ్చింది. దీని ప్రభావంతో మంగళవారం ఉదయం 5 గంటల నుంచే నగరంలో వర్షం భారీగా కురిసింది. కోడంబాక్కం, అజీజ్‌నగర్, వ్యాసర్పాడితదితర ప్రాంతాల్లో చేరిన వర్షపునీటిని తొలగిస్తున్నారు. వ్యాసర్పాడి గణేష్‌పురం ప్రాంతంలోని రైల్వే వంతెన కింద వర్షపునీరు చేరడంతో ఆ మార్గంలో వాహనాల రాకపోకలను నిషేధించారు.


నీటిలో సరదాగా జలకాలాట - వర్షపునీటిని తొలగిస్తున్న పారిశుధ్య కార్మికులు
వర్షపు నీటితో నిండిన మెరీనా సర్వీసురోడ్డు - చూలై అంకాళమ్మ ఆలయంలో చేరిన వర్షపునీరు

ప్రపంచ కప్ క్రికెట్ పోటీలకు 70 ఏళ్ల తమిళ రైతు ఎంపిక


ఉదయగిరి కాశియప్పన్

చెన్నై, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): న్యూజిలాండ్‌లో వచ్చే ఏడాది మార్చిలో జరుగనున్న 70 ఏళ్ల పురుషుల ప్రపంచ కప్ క్రికెట్ కోసం భారత జట్టుకు కోవై జిల్లాకు చెందిన రైతు ఎంపికయ్యాడు. కాళియప్ప గౌండన్‌పుదూర్‌కు చెందిన రైతు ఉదయగిరి కాశియప్పన్ (70) బీకాం డిగ్రీ చదివి, వ్యవసాయం చేస్తున్నాడు. గతంలో కూడా వివిధ దేశాల్లో జరిగిన వృద్ధుల క్రికెట్ పోటీల్లో పాల్గొన్న కాశియప్పన్.. ఇప్పుడు తాజాగా ప్రపంచ కప్ పోటీలకు ఎంపికయ్యాడు. దీని గురించి కాశియమప్పన్ మీడియాతో మాట్లాడుతూ.. గతంలో తాను ఇంగ్లాండ్, న్యూజిలాండ్, కెనడా, శ్రీలంక సహా 8 దేశాల్లో జరిగిన పోటీల్లో పాల్గొన్నానని తెలిపాడు. 70 ఏళ్ల వయస్సు క్రికెట్ పోటీల కోసం ఇటీవల ముంబైలో ఎంపిక శిబిరం జరిగిందని, అక్కడ రెండు మ్యాచ్‌లు నిర్వహించి, 16 మందిని జట్టుకు ఎంపిక చేశారని వివరించాడు. తమిళనాడు నుంచి తాను ఒక్కడినే ఎంపికయ్యానని, క్రీడలకు వయస్సు అడ్డంకి కాదని, క్రీడల ద్వారా మంచి ఆరోగ్యం పొందుతామని చాటిచెప్పడమే తన లక్ష్యమని కాశియప్పన్ వివరించాడు.

బోగీల్లో హారతులివ్వొద్దు

- అయ్యప్ప భక్తులకు దక్షిణ రైల్వే విజ్ఞప్తి



అయ్యప్ప భక్తులకు అవగాహన కల్పిస్తున్న రైల్వే పోలీసులు

అడయార్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): బోగీల్లో కర్పూర హారతులు ఇవ్వరాదని అయ్యప్ప భక్తులకు దక్షిణ రైల్వే సూచించింది. ప్రస్తుతం శబరిమల సీజన్ కావడంతో మాలధారణ చేసిన భక్తులు శబరిమలకు వెళ్తున్నారు. మాలధారణ చేసిన భక్తులు ఉదయం, సాయంత్రం పుణ్యస్నానాలు ఆచరించి, శరణు ఘోష చేస్తుంటారు. ఆ సమయంలో, స్వామివారికి హారతులిస్తుంటారు. ఈ క్రమంలో, శబరిమలకు రైళ్లలో వెళ్తున్న భక్తులు హారతులిస్తున్నట్లు ఫిర్యాదులున్నాయి. రైళ్లలో అగ్నిప్రమాదాలు సంభవించే వస్తువులు తీసుకెళ్లడంపై నిషేధం కారణంగా, అయ్యప్ప భక్తులు రైలు బోగీల్లో హారతులివ్వరాదని దక్షిణ రైల్వే విజ్ఞప్తి చేసింది. ఆ ప్రకారం సెంట్రల్ రైల్వేస్టేషన్‌లో అయ్యప్ప భక్తులకు ఈ విషయమై రైల్వే పోలీసులు అవగాహన కల్పిస్తున్నారు.

'నలంకాక్కుమ్ స్టాలిన్'పై సీఎం సమీక్ష

ప్యారీస్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): 'నలంకాక్కుమ్ స్టాలిన్' పథకం పనితీరుపై ముఖ్యమంత్రి స్టాలిన్ మంగళవారం సచివాలయంలో మంత్రులు, ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు ఆగస్టు 2వ తేదీ నగరంలో సీఎం స్టాలిన్ ప్రారంభించిన నలంకాక్కుమ్ స్టాలిన్ పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 9,86,732 మంది లబ్ధిపొందారు. ఈ పథకాన్ని విజయవంతం చేసేందుకు ప్రభుత్వం రూ.13.58 కోట్లు కేటాయించింది. ఈ పథకానికి రోజురోజుకు ప్రజాదరణ పెరుగుతున్న నేపథ్యంలో సీఎం మంగళవారం అధికారులతో సమిక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆరోగ్య శాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మురుగానందం, ప్రిన్సిపల్ కార్యదర్శి సెంథిల్ కుమార్, ఆహారభద్రతా విభాగం కమిషనర్ లాల్‌వేనా, దివ్యాంగుల సంక్షేమశాఖ కార్యదర్శి మధుమతి, లక్ష్మీప్రియా తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సీఎం స్టాలిన్







పొగమంచు వాలింది.. ఇలగొంతు వణికింది..

మన రాష్ట్రంలో అత్యంత చల్లని ప్రదేశంగా లంబసింగిని పేర్కొంటారు. సముద్రమట్టానికి 3,300 అడుగుల ఎత్తులో ఉండే ఈ ప్రదేశం శీతాకాలంలో పొగమంచు కమ్మేసి ఉంటుంది. నేలకు వాలే మబ్బులు.. వణికించే చలి.. ఈ చల్లని అనుభూతి కోసం పర్యాటకులు పరుగులు తీస్తారు. సరిగ్గా ఇటువంటి వాతావరణమే తిరుమల కొండమీద గత మూడు రోజులుగా కనిపిస్తోంది. పగలు కూడా చీకటి కమ్ముకుంటోంది. లోయల్లోకి దిగిన మబ్బులతో కనుమరోడ్లు కొత్త అందాలను పంచుతున్నాయి. పొగమంచు మబ్బులు నేలకు వాలి ఆలయ పరిసరాలు మసక మసకగా మారిపోతున్నాయి. చలికి వణుకుతూనే ఈ దృశ్యాలు నేపథ్యంగా భక్తులు ఫోటోలు దిగుతున్నారు. పట్టపగలు కూడా హెడ్‌లైట్లు వేసుకునే వాహనాలు తిరుమలలో ప్రయాణించాల్సి వస్తోంది. మంచుమబ్బులతో కనువిందు చేస్తున్న శ్రీవారి పాదాలు, పాపనాశనం, పార్వేటి మండపం ప్రాంతాలను సందర్శించేందుకు భక్తులు బారులు తీరుతున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



రాజధానిలో మరో వినోద ప్రాంతం

● రూ.4 కోట్లతో తంగల్ సరస్సు అభివృద్ధి

అడయార్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక షోలింగనల్లూర్ జలాశయాన్ని రూ.4 కోట్లతో వినోద కేంద్రంగా మార్చే ప్రక్రియను గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) ప్రారంభించింది. రాజధాని నగరం చెన్నైలోని నీటివనరులు ఆక్రమించి అనేక నిర్మాణాలను వెలిశాయి. అలాగే, శివారు ప్రాంతాల పరిస్థితి చెప్పనవసరం లేదు. ఆక్రమణలతో పరిస్థితులు మారి భారీవర్షం కురిస్తే పెరుంబాక్కం, చిట్లపాక్కం, షోలింగనల్లూర్ వంటి ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయి. ఈ ప్రాంతాల్లోని అనేక జలవనరులు ఆక్రమణలకు గురయ్యాయి. మిగిలిన జలాశయాలకు చేరుకోగల వర్షపు నీటి కాలువలు కూడా ఆక్రమించుకోవడంతో వర్షపు నీరు వెళ్లే మార్గం లేకుండా పోయింది.

400 జలాశయాలు...

1906వ సంవత్సరంలో నగరం, శివారు ప్రాంతాల్లో సుమారు 400లకు పైగా సరస్సులు, చెరువులుండేవి. ప్రస్తుతం వాటిలో 50 కూడా లేవు. అయినప్పటికీ, ప్రస్తుతం ఉన్న జలాశయాలు రక్షించుకునేందుకు వాటిని లోతు చేయడమే ఉత్తమ మార్గమని సామాజిక కార్యకర్తలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో, నగరం, శివారులోని జలాశయాలను అభివృద్ధి చేసి వినోద ప్రాంతాలుగా మార్చే ప్రాజెక్ట్‌ను రాష్ట్ర ప్రభుత్వం చేపట్టింది. ఈ ప్రాజెక్ట్‌లో పలు జలాశయాలను పునరుద్ధరిస్తున్నారు. వీటిలో, షోలింగనల్లూర్ తంగల్ సరస్సు, విల్లివాక్కం సరస్సు, కొరట్టూరు, రెట్టేరి, పెరుంగుడి, పోరూర్ వంటి సరస్సులు పునరుద్ధరించి, వాటి గట్లపై ఆకుపచ్చ నడక మార్గాలు, ఉద్యానవనాలు ఏర్పాటుచేయనున్నారు. ఆ ప్రకారం, షోలింగనల్లూర్‌లోని తంగల్ సరస్సును పునరుద్ధంచనున్నారు. జలవనరుల శాఖకు చెందిన 21 ఎకరాల ఈ సరస్సు చాలా వరకు ఆక్రమణలకు గురైంది. ఈ క్రమంలో, సరస్సును పునరుద్ధరించి, వరద నీటిని నివారించేలా వర్షాకాలంలో నీటిని నిల్వచేసి, పచ్చదనం సంతరించుకోనున్న ఈ ప్రాంతం పక్షులకు ఇష్టమైన ప్రదేశంగా రూపొందించాలని నిర్ణయించారు.

రూ.4 కోట్లు కేటాయింపు...

కోయంబత్తూర్‌కు చెందిన 'సిరుతుళి' అనే స్వచ్ఛంధ సంస్థ ఇన్ఫోసిస్ సాయంతో ఈ సరస్సు పునరుద్ధరణకు ముందుకు వచ్చింది. ఇందుకోసం, కంపెనీ తన సీఎస్ఆర్ నిధి నుంచి రూ.2.5 కోట్లు కేటాయించింది. ప్రస్తుతం ఈ జలాశయంలో ఐదడుగుల లోతున వంద మిలియన్ లీటర్ల నీరు నిల్వచేయొచ్చు. పునరుద్ధరణ చర్యల్లో భాగంగా జలాశయం లోతు పదడుగులకు పెంచి 300 మిలియన్ లీటర్ల నీరు నిల్వచేసేలా ప్రణాళిక రూపొందించారు. పునరుద్ధరణ పనులు పూర్తయిన తర్వాత, ఈ ప్రాంతాన్ని వినోద ప్రాంతంగా రూపొందించాలని నిర్ణయించిన జీసీసీ, ఈ ప్రాజెక్ట్ కోసం రూ.4 కోట్లు కేటాయించింది.


షోలింగనల్లూర్ జలాశయం

కారైక్కుడి రైల్వేస్టేషన్‌కు
నూతన సొబగులు




వెయిటింగ్ హాల్ - ప్లాట్‌ఫారాలపై ఏర్పాటుచేసిన 'ఫాబ్ స్టైర్‌వే'

పెరంబూర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కారైక్కుడి రైల్వేస్టేషన్ ఆధునిక సౌకర్యాలతో ముస్తాబవుతోంది. అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్ (ఏబీఎస్ఎస్) పథకంలో దేశంలోని రైల్వే స్టేషన్లను ఆధునికీకరణ పనులు జరుగుతున్నాయి. శివగంగ జిల్లాలోని కారైక్కుడి రైల్వేస్టేషన్ దక్షిణ రైల్వే పరిధిలోని మదురై డివిజన్‌లో ప్రధాన స్టేషన్. జిల్లాలోని పలు ఆధ్యాత్మిక ప్రాంతాలను సందర్శించేందుకు పొరుగు జిల్లాలు, రాష్ట్రాల భక్తులు ఈ రైల్వేస్టేషన్‌కు వస్తుంటారు. ఈ నేపథ్యంలో, ఏబీఎస్ఎస్ పథకంలో రూ.20.34 కోట్లతో కారైక్కుడి రైల్వేస్టేషన్ పునరద్ధరణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ప్రవేశద్వారం, ప్లాట్ ఫారాల విస్తరణ, ప్రయాణికులకు కూర్చొనేలా సీటింగ్ సదుపాయం, అధునాతన టాయిలెట్లు, బుకింగ్ కౌంటర్స్, ప్రయాణికుల విశ్రాంతి గదులు, ఫుట్ ఓవర్ బ్రిడ్జి తదితర ఆధునిక వసతులు, సౌకర్యాలతో కారైక్కుడి రైల్వేస్టేషన్ పునరుద్ధరించినట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది.

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

బొమన్ సాబ్ లుక్

ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'రాజాసాబ్'. టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. జనవరి 9న విడుదలవుతోంది. ఈ చిత్రంలో అతీంద్రియ శక్తుల పరిశోధకుడిగా బాలీవుడ్ నటుడు బొమన్ ఇరానీ కీలక పాత్ర పోషిస్తున్నారు. మంగళవారం ఆయన పుట్టిన రోజు. ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతూ చిత్రబృందం స్పెషల్ పోస్టర్‌ను విడుదల చేసింది. హారర్ కామెడీ జానర్‌లో ఎవర్‌గ్రీన్ మూవీగా నిలిచిపోయేలా 'రాజా సాబ్'ను రూపొందిస్తున్నారు దర్శకుడు మారుతి. మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధి కుమార్ ఈ చిత్రంలో హీరోయిన్లుగా నటిస్తున్నారు.



కథను మలుపుతిప్పే పాత్ర పోషించాను

- సంయుక్త



'అఖండ 2: తాండవం' చిత్రంలో అవకాశం వచ్చినప్పుడు నేను చాలా బిజీగా ఉన్నాను. ఒక మంచి సినిమాలో అవకాశం వస్తే తిరస్కరించకూడదు అని భావించి డేట్స్ అడ్జెస్ట్ చేసుకొని నటించాను. ఈ సినిమాలో కథను మలుపు తిప్పే పాత్ర పోషించాను' అని సంయుక్త అన్నారు. నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'అఖండ 2: తాండవం'. నందమూరి తేజస్విని సమర్పణలో రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మించారు. ఈ నెల 5న విడుదలవుతోంది. ఈ సందర్భంగా కథానాయిక సంయుక్త సినిమా విశేషాలను మీడియాతో పంచుకున్నారు.

- "అఖండ 2: తాండవం' చిత్రం 'అంచనాలకు మించి ఉండబోతోంది. బోయపాటి గారు గ్రేట్ విజన్‌తో తెరకెక్కించారు. విజువల్స్ అద్భుతంగా ఉంటాయి.
- ఈ చిత్రంలో నా పాత్ర చాలా కీలకంగా, స్టైలిష్‌గా ఉంటుంది. నా కెరీర్‌లో తొలిసారి ఓ మాస్ సాంగ్ చేశాను. ఇలాంటి మాస్ సాంగ్ ఇప్పటివరకూ చేయలేదు. చాలా కష్టపడ్డాను. ప్రాక్టీస్ చేసే సమయంలో మోకాలు దెబ్బతిని సహకరించకపోవడంతో ఫిజియోథెరపీ చేయించుకున్నా.
- బాలకృష్ణ గారు దర్శకుల నటుడు. వారు ఎలా చెబితే అలా చేస్తారు. నటుడిగానూ ఆయన విజన్ అద్భుతం. సెట్‌లో ఆయన చాలా స్నేహంగా ఉండేవారు. ఆయన నటించిన 'డాకూ మహారాజ్' నా ఫేవరేట్ చిత్రం.
- తమన్ సంగీతం, ముఖ్యంగా సంస్కృత శ్లోకాలతో సాగే నేపథ్య సంగీతం ప్రేక్షకులను అలరిస్తుంది. మా నిర్మాతలు రామ్, గోపీ గారు మేకింగ్‌లో రాజీ పడలేదు. సినిమాను ప్రేక్షకులకు చేరువ చేసేందుకు దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం కథానాయికగా స్వయంభు, నారీ నారీ నడుమ మురారి చిత్రాలు చేస్తున్నాను.

అఖండ 2
టికెట్ ధరల పెంపు
- ఏపీ ప్రభుత్వ అనుమతి

నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా నటించిన 'అఖండ 2' సినిమా టికెట్ ధరల పెంపునకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మంగళవారం అనుమతిచ్చింది. ఈ నెల 5న ఈ చిత్రం విడుదలవుతోంది. నిర్మాతల వినతి మేరకు భారీ బడ్జెట్ సినిమాలకు ప్రభుత్వం ప్రత్యేక అనుమతి జారీ చేస్తోంది. అందులో భాగంగానే ఈ సినిమా విడుదలైన తొలి పది రోజులు టికెట్ ధరలు పెంచుకునేందుకు డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లకు పూర్తి అనుమతి లభించింది. సింగిల్ స్క్రీన్లలో సాధారణ రేటుపై రూ. 75, మల్టీప్లెక్స్‌ల్లో రూ. 100 పెంపునకు అనుమతించింది. ఈ నెల నాలుగున ప్రదర్శించే ప్రీమియర్ షో టికెట్ ధర రూ. 600గా నిర్ణయించారు.

విందు భోజనంలా ఎంజాయ్ చేసే సినిమా



క్రికెట్ క్రీడ నేపథ్యంలో కామెడీ ప్రధానాంశంగా రూపుదిద్దుకున్న చిత్రం 'గేట్'. సుడిగాలి సుధీర్, దివ్యభారతి జంటగా నటించారు. ఎం. చంద్రశేఖర్ నిర్మించారు. మంగళవారం నిర్మాత దిల్‌రాజు టీజర్‌ను విడుదల చేసి, యూనిట్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ 'అడ్డంకులను దాటుకొని ఈ సినిమాను అద్భుతంగా తీర్చిదిద్దాం. మంచి అభిరుచితో చేసిన సినిమా ఇది. ప్రేక్షకులు విందు భోజనంలా ఎంజాయ్ చేస్తారు. మణిశర్మ నేపథ్య సంగీతం సినీ ప్రియులను మెప్పిస్తుంది. త్వరలో విడుదల తేదీ ప్రకటిస్తాం' అని చెప్పారు. సహ నిర్మాత రవీందర్ రెడ్డి మాట్లాడుతూ 'ఈ సినిమాను మాస్ ఎంటర్‌టైనర్‌గా తీశాం. చంద్రశేఖర్ రెడ్డి ఈ సినిమా కోసం చాలా కష్టపడ్డారు' అని తెలిపారు. ఆద్యంతం వినోదం పంచే చిత్రమిదని దివ్యభారతి తెలిపారు.

యువతకు కనెక్ట్ అయ్యే కథ



రివేంజ్ స్టోరీతో సాగే థ్రిల్లింగ్ ప్రేమకథా చిత్రం 'సైక్ సిద్ధార్థ్'. శ్రీనందు, యామిని భాస్కర్ జంటగా నటించారు. వరుణ్‌రెడ్డి దర్శకత్వంలో శ్రీనందు, శ్యామ్ సుందర్‌రెడ్డి నిర్మించారు. ఈ నెల 12న విడుదలవుతోంది. మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో చిత్రబృందం ట్రైలర్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా శ్రీనందు మాట్లాడుతూ 'ఇప్పుడున్న సమాజానికి, యువతకు కనెక్ట్ అయ్యే కథతో తెరకెక్కిన చిత్రమిది. సురేశ్‌బాబు గారు సినిమా చూసిన వెంటనే పంపిణీ చేసేందుకు అంగీకరించారు. సురేశ్ ప్రొడక్షన్స్ ఈ సినిమాను తీసుకోవడంతో నా కల నెరవేరినట్లయింది' అని చెప్పారు. వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ 'ప్రచార చిత్రాలకు చక్కని ప్రేక్షకాదరణ దక్కింది. అన్ని వర్గాల ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేసే చిత్రమిది. తెలుగు ప్రేక్షకుల అభిరుచికి తగ్గట్టుగా స్క్రీన్‌ప్లేలో చాలా మార్పులు చేశాం' అని చెప్పారు.

అనుమాన పక్షి వచ్చేది అప్పుడే



రాగ్ మయూర్, మెరిన్ ఫిలిప్ జంటగా 'డీజే టిల్లు' ఫేమ్ విమల్ కృష్ణ తెరకెక్కిస్తున్న చిత్రం 'అనుమాన పక్షి'. చిలక ప్రొడక్షన్స్‌పై రాజీవ్ చిలక, రాజేశ్ జగ్తియాని, హీరాచంద్ దండ్ నిర్మిస్తున్నారు. తాజాగా సినిమా విడుదల తేదీని వెల్లడిస్తూ ఓ వీడియోను షేర్ చేశారు మేకర్స్. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుందని తెలిపారు. వినోద ప్రధానంగా సాగే ఈ సినిమా విమల్ కృష్ణ మార్క్‌తో స్టైలిష్‌గా ఉండనుందని చెప్పారు. రాగ్ మయూర్ పాత్ర చాలా విభిన్నంగా ఉంటుందని పేర్కొన్నారు. అతిగా ఆలోచిస్తూ, అతి జాగ్రత్తతో ఉండే ఆయన రోల్ ప్రేక్షకులను ఆకట్టుకోవడమే కాక, కడుపుబ్బా నవ్విస్తుందని మేకర్స్ అన్నారు. బ్రహ్మాజీ, ప్రిన్స్ సెసిల్, అనన్య, చరిత్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి డీఓపీ: సునీల్‌కుమార్ నామా, సంగీతం: శ్రీచరణ్ పాకాల.

ప్రేమ కోసం యుద్ధం



రోషన్ కనకాల, సాక్షి మడోల్కర్ జంటగా 'కలర్ ఫొటో' ఫేమ్ సందీప్ రాజ్ తెరకెక్కించిన చిత్రం 'మోగ్లీ 2025'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బేనర్‌పై టీజీ విశ్వప్రసాద్, కృతిప్రసాద్ నిర్మించారు. ఈ నెల 12న సినిమా విడుదలవుతోంది. మంగళవారం చిత్రం ట్రైలర్‌ను హీరోయిన్ రష్మిక మందన్న విడుదల చేసి, చిత్రబృందానికి శుభాకాంక్షలు తెలిపారు. ట్రైలర్‌లో పాత్రలను, కథా నేపథ్యాన్ని పరిచయం చేసిన విధానం ఆకట్టుకుంది. 'తన ప్రేమ కోసం యుద్ధం చేసే ప్రతీవాడు హీరోనే' అంటూ కథానాయకుడు పలికిన సంభాషణలు ఆకట్టుకున్నాయి. బండి సరోజ్‌కుమార్ ఈ సినిమాలో విలన్‌గా నటించారు. హర్ష చెముడు కీలక పాత్ర పోషించారు. ఈ చిత్రానికి ఎడిటర్: కోదాటి పవన్‌కల్యాణ్, డీఓపీ: రామ మారుతి ఎమ్, సంగీతం: కాలభైరవ.

కాంతారపై కామెడీ
రణ్‌వీర్ క్షమాపణలు



కాంతార చిత్రంపై తాను చేసిన వ్యాఖ్యలకు బాలీవుడ్ హీరో రణ్‌వీర్ సింగ్ మంగళవారం క్షమాపణలు చెప్పారు. ఎవరినీ కించపరచడం తన ఉద్దేశం కాదని తెలిపారు. 'రిషబ్ శెట్టి బాగా నటించారని చెప్పడం కోసమే నేను అలా నటించాను. అలాంటి సన్నివేశాల్లో నటించాలంటే చాలా కష్టం. అయినా ఏ ఇబ్బంది లేకుండా అటువంటి సన్నివేశాలను ఎంతో ఈజ్‌తో చేసే ఆయనంటే నాకు చాలా ఇష్టం. మన దేశంలోని ప్రతీ సంప్రదాయం మీద నాకు అపారమైన గౌరవం ఉంది. నా వ్యాఖ్యలు ఎవర్నైనా బాధపెట్టి ఉంటే క్షమించండి' అని పేర్కొన్నారు. 'కాంతార'పై రణ్‌వీర్ చేసిన వ్యాఖ్యలపై హిందూ జనజాగృతి సమితి ఫిర్యాదు చేసింది. ఆయన చేసిన కామెంట్స్ హిందువుల విశ్వాసాన్ని దెబ్బతీశాయని పేర్కొంది. గోవాలో ఇటీవలె ముగిసిన ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా (ఇఫీ) వేడుకల్లో రణ్‌వీర్ 'కాంతార' చిత్రంపై చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. వేదికపై మాట్లాడుతూ "కాంతార' సినిమాలో రిషబ్ శెట్టి నటన అద్భుతం. హీరో పాత్రలోకి దెయ్యం ప్రవేశించినప్పుడు వచ్చే సన్నివేశాలు చాలా బాగున్నాయి" అని రణ్‌వీర్ పేర్కొన్నారు. ఆ సినిమాలో ఎంతో పాపులర్‌గా మారిన 'ఓ' అనే శబ్దాన్ని స్టేజీపై అనుకరించారు. దేవతను ఆయన దెయ్యంగా పోల్చాడని కర్ణాటక వాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. క్షమాపణలు చెప్పాల్సిందేనని డిమాండ్ చేశారు.

వినూత్నంగా వన్ బై ఫోర్



నూతన నటీనటులతో సరికొత్త తరహాలో తెరకెక్కిన కామెడీ థ్రిల్లర్ 'వన్ బై ఫోర్'. వెంకటేశ్ పెద్దపాలెం, అపర్ణ మల్లిక్ జంటగా నటించారు. బాహుబలి పళని కె. దర్శకత్వంలో రంజన రాజేశ్ గుంజల్, రోహిత్ రాందాస్ గుంజల్ సంయుక్తంగా నిర్మించారు. ఈ నెల 12న విడుదలవుతోంది. మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో చిత్రబృందం ట్రైలర్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా వెంకటేశ్ పెద్దపాలెం మాట్లాడుతూ 'కొత్త తరహా కథాంశంతో ఈ క్రైమ్ డ్రామాను తీశాం. పళని గారి టేకింగ్ సినిమాకు ప్రత్యేకాకర్షణ. 'హారర్, సస్పెన్స్ అంశాలు, పోరాట ఘట్టాలు చాలా బావుంటాయి' అని చెప్పారు. దర్శకుడు మాట్లాడుతూ 'క్రైమ్ అంశాలతో పాటు మానవ సంబంధాలను చర్చిస్తూ సందేశాత్మకంగా సాగే చిత్రమిది. పతాక ఘట్టాలే సినిమాకు హైలెట్' అని చెప్పారు. కథ మీద నమ్మకంతో ఈ చిత్రాన్ని నిర్మించాం, ప్రేక్షకులు ఆశించే అంశాలతో ఆసక్తికరంగా సాగుతుంది అని నిర్మాతలు తెలిపారు.

విడుదలకు సిద్ధం



భాస్కర్, కోటేశ్వర రావు ప్రధాన పాత్రధారులుగా తెరకెక్కిన చిత్రం 'విధాత'. మణికంఠ రాజేంద్రబాబు దర్శకత్వంలో అప్పిని పల్లె భాస్కర చారి నిర్మించారు. విడుదలకు సిద్ధమైంది. ఈ సందర్భంగా మణికంఠ రాజేంద్రబాబు మాట్లాడుతూ 'ఇదో వైవిధ్యభరితమైన చిత్రం. పాత్రలన్నీ సహజ సిద్ధంగా ఉంటాయి' అని అన్నారు. 'ఓ యదార్థ సంఘటన ఆధారంగా ఈ చిత్రాన్ని రూపొందించాము' అని అప్పిని పల్లె భాస్కర చారి తెలిపారు.